# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం-11- అక్టోబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 134 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## డీజీపీ ఎదుట లొంగిపోయిన మావోయిస్టు కీలక నేతలు

హైదరాబాద్,అక్టోబర్10(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట ముగ్గురు మావోయిస్టు కీలక నేతలు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ, "కుంకటి వెంకటయ్య అలియాస్ వికాస్, మొగిలిచర్ల వెంకటరాజు అలియాస్ చందు, తోడెం గంగ అలియాస్ సోనీ (ఛత్తీస్గఢ్) మావోయిస్టు పార్టీ నుంచి బయటికొచ్చి జనజీవన స్రవంతిలో కలిసిపోతున్నారు" అని తెలిపారు.సిద్దిపేట జిల్లాకు చెందిన కుంకటి వెంకటయ్య 1990లో పీడబ్ల్యూడీ ఏర్పాటు చేసిన రైతు కూలీ సభలకు హాజరై అదే ఏడాది అజ్ఞాతంలోకి వెళ్లారు. కమాండర్ బాలన్న ఆధ్వర్యంలోని దళంలో చేరి, తరువాత 35 సంవత్సరాలపాటు వివిధ హోదాల్లో పనిచేశారు.

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన మొగిలిచర్ల వెంకటరాజు అలియాస్ చందు (45) 11 ఏళ్ల వయసులోనే విప్లవ గీతాలకు ఆకర్షితుడై మావోయిస్టు ఉద్యమంలో చేరాడు. 1993లో నర్సంపేట దళంలో రిక్రూట్ అయి, రాష్ట్రస్థాయి కమిటీలో పలు హోదాల్లో సేవలందించాడు. మావోయిస్టు నాయకత్వంతో సైద్ధాంతిక విభేదాల కారణంగా, తన భార్య తోడెం గంగతో కలిసి పోలీసుల పిలుపునకు స్పందించి లొంగిపోయాడు ."ఇటీవల కాలంలో మొత్తం 403 మంది మావోయిస్టులు స్వచ్ఛందంగా పోలీసుల ఎదుట లొంగిపోయారు" అని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

## మరియా కొరీనా మచాడోకు నోబెల్ శాంతి పురస్కారం

- నోబెల్ శాంతి బహుమతి విజేత
- ప్రజాస్వామ్యం కోసం పోరాటం
- బెదిరింపులు, సవాళ్లు
- ట్రంప్ ప్రయత్నాలు ఫలించలేదు
- నోబెల్ శాంతి బహుమతి చరిత్ర



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి మరియా కొరీనా మచాడోను వరించింది. ఈ విషయాన్ని నార్వే నోబెల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. వెనెజువెలాకు చెందిన మరియా కొరీనా ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినందుకు గానూ ఈ పురస్కారం లభించింది. అయితే, ఈ అత్యున్నత పురస్కారం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఈ ఏడాది మొత్తం 338 మంది ఈ శాంతి పురస్కారానికి నామినేట్ అవ్వగా.. అకాడమీ సభ్యులు మరియా వైపు మొగ్గుచూపారు. వెనెజువెలా ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను మచాడోకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నోబెల్ కమిటీ వెల్లడించింది. నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్య సాధన కోసం శాంతి మార్గంలో ఆమె విశేష కృషి చేశారని తెలిపింది. ఈ క్రమంలో మచాడో ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నారని.. గత ఏడాది కాలంగా అజ్ఞాతంలో జీవించాల్సి వచ్చిందని పేర్కొంది. ఆమె వెనెజువెలా పార్లమెంట్ సభ్యురాలిగా, దేశ విపక్ష నేతగా పనిచేశారు. వెనెజువెలా సైనికీకరణను తీవ్రంగా వ్యతిరేకించిన ఆమె.. శాంతియుత మార్గంలో ప్రజాస్వామ్యం కోసం కృషిచేసి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని నోబెల్ కమిటీ వెల్లడించింది. నోబెల్ శాంతి బహుమతిని 1901 నుంచి 105 సార్లు ప్రకటించారు. ఇందులో 111 మంది వ్యక్తులు, 31 సంస్థలు ఇప్పటివరకు ఈ పురస్కారాన్ని అందుకున్నాయి. ఈ అవార్డు అందుకున్న అతిపిన్న వయస్కురాలిగా పాకిస్థాన్‌కు చెందిన హక్కుల కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్ నిలువగా.. జోసెఫ్ రాట్‌బ్లాట్ 86 ఏళ్ల వయసులో దీనిని అందుకున్నారు.



## నోబెల్‌పై ట్రంప్ ఆవేదన!

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) నోబెల్ శాంతి బహుమతి పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. నేడు ఈ అవార్డుకు సంబంధించి ప్రకటన రానున్న నేపథ్యంలో ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూఎస్ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా కు నోబెల్ ఇవ్వడంపై అక్కసు వెళ్లగక్కారు. ఏమీ చేయకపోయినా ఒబామాకు ఇచ్చారని, ఎనిమిది యుద్ధాలు ఆపిన తనకు వస్తుందో, రాదో తెలియడం లేదంటూ ఆవేదన వ్యక్తంచేశారు.

గురువారం వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గాజాలో శాంతి నెలకొల్పడంతో సహా తాను ఎనిమిది యుద్ధాలను ఆపడంలో విజయం సాధించానంటూ ఉద్ఘాటించారు.

మిగతా 2లో



## నవంబరు నాటికి చెరువుల అభివృద్ధి పూర్తి చేయాలి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్19 (తెలంగాణముచ్చట్లు): మాధాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు, కూకట్పల్లిలోని నల్లచెరువు అభివృద్ధి పనులు నవంబరు నాటికి పూర్తి కావాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఈ రెండు చెరువుల అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ చెరువులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.



మిగతా 2లో



## హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వేగం కొత్త రికార్డు

- పట్టణాభివృద్ధిపై ప్రభుత్వ భారీ మదుపు
- భవిష్యత్‌కు ఎలక్ట్రిక్ నగరంగా హైదరాబాద్ లక్ష్యం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం వేగంగా దూసుకెళ్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. హైటెక్స్‌లో జరిగిన తెలంగాణ నరేడ్కో ప్రాపర్టీ షోను ప్రారంభించిన ఆయన, ఇటీవల ప్రభుత్వ వేలంలో ఎకరం భూమి 177 కోట్ల రూపాయలకు అమ్ముడవ్వడం నగర పెట్టుబడి అవకాశాలపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఇలా భూమి విలువ రికార్డు



స్థాయిలో ఉండటం ద్వారా హైదరాబాద్ దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించిందని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో



## జాగృతిలో చేరడమంటే బతుకమ్మ ఆడినట్లే

- కల్వకుంట్ల కవిత విమర్శలు, పోరాట పిలుపు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) హైదరాబాద్‌లో తెలంగాణ జాగృతి కార్యకలాపాలకు కొత్త ఊపిరి పోసేలా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ జాగృతిలో చేరడం అంటే బతుకమ్మ ఆడినట్లే కానీ చేతుల్లో పూలు కాకుండా పిడికిలెత్తిన పోరాట స్ఫూర్తి ఉండాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో పలు జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలకు కవిత కండువాలు

మిగతా 2లో

## జూబ్లీహిల్స్ టిక్కెట్‌పై అసంతృప్తి

### అంజన్ కుమార్ యాదవ్‌ను బుజ్జగించిన కాంగ్రెస్ అగ్రనేతలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసిన సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఇంట్లో రాజకీయ సందడి నెలకొంది. పార్టీ నిర్ణయంపై మనస్తాపానికి గురైన అంజన్ కుమార్‌ను ఒప్పించేందుకు ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ తదితరులు ఆయన నివాసం చేరుకున్నారు. టిక్కెట్‌ను నవీన్ యాదవ్‌కు కేటాయించాల్సిన పరిస్థితేంటో వివరించారు.



తనెప్పుడూ పార్టీకి విరుద్ధంగా నడుచుకోలేదని, కష్టకాలంలో కూడా కాంగ్రెస్‌కు అండగా నిలిచానని అంజన్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## ఆసిఫాబాద్ జిల్లాలో గంజాయి సాగు సంచలనం

- గిరిజన రైతు అరెస్టు
- పక్కా ప్రణాళికతో పోలీసుల దాడులు
- రూ.1 లక్ష విలువైన గంజాయి మొక్కల స్వాధీనం

ఆసిఫాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిషేధిత గంజాయి సాగు వెలుగులోకి రావడంతో స్థానికంగా పెద్ద దుమారం రేగింది. తిర్యాణి మండలం పరిధిలోని కొద్దుగూడ గ్రామంలో గంజాయి మొక్కలను దాచిపెట్టి సాగు చేస్తున్నారనే సమాచారం సిద్ధాంత ప్రాతిపదికన పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి రహస్యంగా పర్యవేక్షణ నిర్వహించారు.



**పక్కా ప్రణాళికతో పోలీసుల దాడులు**

శుక్రవారం తెల్లవారుజామునే పోలీసులు గ్రామానికి చేరుకుని పొలాలను చెక్ చేశారు. కంది పంటల మధ్య చాకచక్యంగా దాచిన గంజాయి మొక్కలు గుర్తించడంతో అధికారులు

మిగతా 2లో

## సీపీజీఈటీ రెండో దశ ప్రవేశాలకు పూర్తి షెడ్యూల్ విడుదల

### ప్రతీ తేదీ కీలకం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు) టీజీ సీపీజీఈటీ 2025 ప్రవేశాల తొలి దశ పూర్తి కాగా, రెండో దశ అడ్మిషన్ ప్రక్రియకు సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను ఉస్మానియా యూనివర్సిటీ తరపున కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి ప్రకటించారు.

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## నోబెల్‌పై ట్రంప్ ఆవేదన!

((మొదటి పేజీ తరువాయి)

అయినా, తనకు ఈ అవార్డు ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. ఒబామా ఏమీ చేయలేదని, పైగా అమెరికాను నాశనం చేశారని విమర్శలు చేశారు. 'అతను ఏమీ చేయకపోయినా అవార్డు పొందాడు. అది ఎందుకిచ్చారో అతనికి కూడా తెలియదు. ఏమీ చేయకుండా అతను యూఎస్‌ను నాశనం చేసినందుకే వారు ఆ బహుమతిని ఇచ్చారు. కానీ, నేను ఎనిమిది యుద్ధాలు ఆపాను. ఇంతకుముందు ఎప్పుడూ ఇది జరగలేదు. అయినా వారు ఏం చేయలేదు. వాళ్లు ఏమీ చేయరని నాకు తెలుసు. అయినా నేను దానికోసం చేయలేదు. అనేకమంది ప్రజల ప్రాణాలు కాపాడేందుకు చేశాను' అని ట్రంప్ అన్నారు. 2009లో ఒబామా ఈ ప్రతిష్ఠాత్మకమైన అవార్డును అందుకున్నారు.

**హంగరీ రచయితకు సాహిత్య నోబెల్**

రెండోసారి అధికారం చేపట్టినప్పటినుంచి ట్రంప్ నోబెల్ బహుమతి కోసం తీవ్రంగా ఆరాటపడుతున్నారు. ఇందుకోసం దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధాలతో పాటు అనేక ఘర్షణలు ఆపానంటూ స్వయంగా ఆయనే ప్రకటించుకున్నారు. ఈ క్రమంలోనే పాక్ సైన్యాధిపతి మునీర్‌తో సహా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహులు ట్రంప్ పేరును నోబెల్ బహుమతికి నామినేషన్‌కు పంపించారు. నోబెల్ శాంతి బహుమతికి సంబంధించి నేడు ప్రకటన వెలువడనుంది. ఈ క్రమంలో ట్రంప్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# స్మార్ట్ సిటీ గడువు పొడిగింపులో ఫలించిన ఎంపీ కడియం కావ్య కృషి

**వరంగల్,అక్టోబర్10(తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ పథకానికి మరోసారి గడువు పొడిగింపు లభించింది. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య నిరంతర కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఈ పథక గడువును డిసెంబర్ 31, 2025 వరకు పొడిగించింది.స్మార్ట్ సిటీ పథకం కింద వరంగల్, హనుమకొండ నగరాల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, సరస్సులు, పబ్లిక్ సౌకర్యాల భవనాలు వంటి పలు అభివృద్ధి పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ పనులను పూర్తిచేయడానికి మరికొంత సమయం అవసరమని ఎంపీ కడియం కావ్య జులై 31న పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు వివరించారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డితో కలిసి స్మార్ట్ సిటీ గడువు పొడిగించాలంటూ కేంద్రాన్ని కోరిన ఎంపీ విజ్ఞప్తి మేరకు మార్చి 2025 వరకు గడువు పొడిగింపు లభించగా, తాజాగా మరోసారి ఎంపీ కృషితో డిసెంబర్ 2025 వరకు గడువు పొడిగింపు లభించింది.ప్రస్తుతం పెద్ద వడ్డేపల్లి చెరువు సుందరీకరణ పనులు



నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టులో గ్రీనరీ, లైటింగ్, ల్యాండ్‌స్కేపింగ్, పాత్‌వే, వాకింగ్ ట్రాక్, స్వాగత తోరణాల ఏర్పాటుతో కూడిన పనులు త్వరగా పూర్తి చేయాల్సి ఉంది. హనుమకొండలోని పద్మాక్షిగుట్ట, ఎన్జీవోస్ కాలనీలలో సెంట్రల్ లైటింగ్, గ్రీనరీ, అండర్ డ్రైనేజీ వ్యవస్థ పనులు కూడా తుదిదశలో ఉన్నాయి.

వరంగల్‌లోని పోతన రోడ్, పాపయ్యపేట ప్రాంతాల్లో నిలిచిపోయిన స్టోర్మ్ వాటర్ డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీ సూచించారు. ఈ ప్రాజెక్టులో సుమారు 12 కోట్ల రూపాయల విలువైన గ్రీనరీ పనులు, పోతన రోడ్డులో స్వాగత తోరణం నిర్మాణం, కరీమాబాద్ దసరా రోడ్, రంగశాయిపేట-ఉర్సు ప్రాంతాల్లో స్మార్ట్ రోడ్ల కింద పాత్‌వేలు, లైటింగ్, గ్రీనరీ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. స్మార్ట్ సిటీ పథకం కింద మిగిలిన పనులు త్వరగా పూర్తి చేస్తే వరంగల్-హనుమకొండ నగరాలు ఆధునిక రూపాన్ని సంతరించుకుంటాయని ఎంపీ ఆశాభావం వ్యక్తం చేశారు.



# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వేగం కొత్త రికార్డు

((మొదటి పేజీ తరువాయి)

ప్రతి సంవత్సరం పట్టణాభివృద్ధికి బడ్జెట్‌లో 10 వేల కోట్లు కేటాయిస్తున్నామని, మురుగునీటి శుద్ధి ప్రాజెక్టులు మరియు తాగునీటి అవసరాల కోసం అదనంగా 13 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.

ఇతర నగరాల్లో లేని విధంగా హైదరాబాద్‌లో 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా, నిరంతర మంచినీటి అందుబాటు జరుగుతోందని ఆయన అన్నారు. భవిష్యత్తులో నగర రవాణా వ్యవస్థను పూర్తి స్థాయిలో ఎలక్ట్రిక్ బస్సులతో నడిపే దిశగా ప్రణాళికలు కొనసాగుతున్నాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపులు అమల్లోకి తీసుకువచ్చామని చెప్పారు. రియల్ ఎస్టేట్ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చే ప్రధాన శక్తిగా మారిందని, రియల్టర్లు మరియు బిల్డర్లు సంపద సృష్టించేవారని, వారి సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగానే ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

హైదరాబాద్ వంటి మహానగరంలో భూమి ఎకరం 177 కోట్లు పలుకుతుండటం నగర విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడిదారుల నమ్మకం, భవిష్యత్ అవకాశాలన్నింటిని స్పష్టంగా చూపుతోంది.

# లనవంబరు నాటికి చెరువుల అభివృద్ధి పూర్తి చేయాలి

((మొదటి పేజీ తరువాయి)

శిల్పారామం, మెటల్ చార్మినార్ వైపుల నుంచి వచ్చే ఇన్లెట్ల అభివృద్ధిలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. శిల్పారామం వద్ద వరద నీరు నిలవకుండా ఇన్లెట్లను మెరుగుపరచాలని, చెరువు చుట్టూ రిటైనింగ్ వాల్ నిర్మాణం బలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం 14 ఎకరాల చెరువును 29 ఎకరాలకు విస్తరించినందున, ఆ విస్తీర్ణంలో నీరు నిల్వ ఉండేలా అభివృద్ధి జరగాలని తెలిపారు.

తమ్మిడికుంట - శిల్పారామం వైపు ప్రధాన ప్రవేశ ద్వారం:

ఓ వైపు హైటెక్ సిటీ, మరోవైపు శిల్పారామం ఉండటంతో, తమ్మిడికుంట చెరువు ప్రధాన ప్రవేశ ద్వారం ఆ వైపునే ఉండేలా రూపొందించాలని కమిషనర్ సూచించారు. చెరువుకు చుట్టూ రహదారులు నిర్మించి, డ్రైనేజీ నీరు చెరువులోకి రాకుండా చర్యలు



తీసుకోవాలని ఆదేశించారు. తమ్మిడికుంట నుంచి వరద నీరు సాఫీగా బయటకు వెళ్లేందుకు వరద కాలువ నిర్మాణం చేపట్టాలని సూచించారు. చెరువు చుట్టూ దాదాపు మూడు కిలోమీటర్ల పాత్‌వేలో నీడనిచ్చే చెట్లు నాటడంతో పాటు ప్రాణవాయువు అందించే వాతావరణాన్ని సృష్టించాలని అన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో తమ్మిడికుంట చెంత వాతావరణం కనీసం మూడు నుంచి నాలుగు డిగ్రీల మేర చల్లగా ఉండేలా చూడాలని సూచించారు.

**నల్లచెరువు,ప్రజలకు సేదతీరే వేదికగా:**

కూకట్పల్లిలోని నల్లచెరువు చుట్టూ వేలాది కుటుంబాలు నివసిస్తున్నందున, వారందరూ సేదతీరేలా చెరువును అభివృద్ధి చేయాలని కమిషనర్ సూచించారు. పాత్‌వేను విశాలంగా అభివృద్ధి చేస్తే ప్రజలు పెద్దఎత్తున వాకింగ్‌కు రావచ్చని తెలిపారు. చెరువు ప్రధాన ప్రవేశ ద్వారం విస్తీర్ణం పెంచి, పక్కనే పిల్లలు, పెద్దలు సేదతీరేలా పార్కును ఏర్పాటు చేయాలని సూచించారు.

చెరువు ఇన్లెట్, ఔట్లెట్ల అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేయాలని జలమండలి అధికారులను ఆదేశించారు. చెరువులోకి మురుగు నీరు కలవకుండా నిర్మాణాలు బలపరచాలని సూచించారు. గతంలో 17 ఎకరాల మేర ఉన్న చెరువును ఆక్రమణలను తొలగించి 27 ఎకరాలకు విస్తరించిన తీరును చూసి స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. తమ ప్రాంతం మరింత ఆహ్లాదకరంగా మారిందని కమిషనర్ రంగనాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# జూబ్లీహిల్స్ టిక్కెట్‌పై అసంతృప్తి

((మొదటి పేజీ తరువాయి)

"పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు వెనక్కి తగ్గలేదు. ఇప్పుడు నన్ను పక్కన పెట్టడం బాధ కలిగించింది. నేను సీనియర్ నాయకుడిని, ఎప్పుడూ ఓటమి చవిచూడలేదు. ఇప్పుడు అవకాశం ఇస్తే గెలిచేవాడిని" అని ఆయన వ్యాఖ్యానించారు. కరోనా సమయంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ, ఆ సమయంలోనే తన ప్రాణం మీదకు వచ్చిందని, అయినా పార్టీ కోసం పని ఆపలేదని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడమే లక్ష్యమని, ఆ దిశగా పార్టీ బలపడాలంటే త్యాగం చేసిన నాయకులను గుర్తించాలని ఆయన సూచించారు. తాను హైదరాబాద్ కాంగ్రెస్ కోసం ఎన్నో సంవత్సరాలు శ్రమించానని, రెండుసార్లు జిల్లా అధ్యక్షుడిగా పని చేశానని చెప్పారు. అంజన్ కుమార్ పోటీ చేస్తే మంచిదని అనుకుంటు



న్న వారిలో తానే ముందున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా ముందు స్పష్టం చేశారు. "హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీకి అంజన్ గారు పెద్ద బలమయ్యారు. ఆయన నాయకత్వం పార్టీకి అవసరం. ఉప ఎన్నికల్లో పార్టీ బలంగా పోటీ చేస్తుంది" అని చెప్పారు. ఈ పరిణామాలతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు కాంగ్రెస్ చర్చలు వేడెక్కాయి. అంజన్ కుమార్ బుజ్జగింపుతో పార్టీ లోపల సంక్షోభం తగ్గుతుందో లేదో చూడాలి.

# జాగృతిలో చేరడమంటే బతుకమ్మ ఆడినట్లే

((మొదటి పేజీ తరువాయి)

కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు హామీలు ఇచ్చి మోసం చేస్తోందని మండిపడ్డారు.

`కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు

కవిత మాట్లాడుతూ ఆడబిడ్డలకు నెలకు 2,500 రూపాయలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి ఇప్పుడు పూర్తిగా మౌనం వహిస్తోందని ఆరోపించారు. కేసీఆర్ కిట్ నిలిచిపోయిందనీ, ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లే మహిళలు ఇప్పుడు ఖాళీ చేతులతో తిరుగుతున్నారని విమర్శించారు. పేదింటి అమ్మాయిల వివాహానికి తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ ఎక్కడుందని ప్రశ్నించారు. ఉద్యోగాల



అంశంపై కూడా ఆమె ఆగ్రహం వ్యక్తం చేస్తూ, సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పిన ప్రభుత్వం, ఈరోజు ఒక్క ఉద్యోగాన్నీ ఇవ్వలేని పరిస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు.

`జాగృతి అంటే పోరాటం.. కవిత హెచ్చరిక

బీసీ బిల్లు తేవాలని, అందుకోసం జాగృతి తరఫున ప్రజా పోరాటాలు ప్రారంభిస్తామని తెలిపారు. జాగృతి అంటేనే పోరాట జెండా, జాగృతి అంటేనే విప్లవ ధ్వజం అని కవిత వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తమ సంస్థ శాంతియుతమైనా కానీ గట్టిగానే పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కవిత మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ప్రశ్నించడమే నిజమైన తెలంగాణ ఆత్మ అని చెప్పారు. "జాగృతిలో చేరడమంటే కేవలం సభ్యత్వం కాదు, హక్కుల కోసం గట్టిగా నిలబడే ధైర్యం" అని నేతలను ఉత్సాహపరిచారు. పథకాలను నిలిపేసిన ప్రభుత్వాన్ని ప్రశ్నించండి, మాట తప్పిందంటే గట్టిగా అడగండి అంటూ పిలుపునిచ్చారు.

# ఆసిఫాబాద్ జిల్లాలో గంజాయి సాగు సంచలనం

((మొదటి పేజీ తరువాయి)


అక్కడికక్కడే వాటిని ఉపం సహా తొలగించారు. అత్రం పాపరావు అనే గిరిజన రైతు ఈ సాగుకు యత్నించినట్లు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

**`రూ.1 లక్ష విలువైన గంజాయి మొక్కల స్వాధీనం**

పోలీసుల ప్రకారం సుమారు 10 గంజాయి మొక్కలను పెంచినట్లు గుర్తించారు. వాటి విలువ మార్కెట్‌లో దాదాపు ఒక లక్ష రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. స్థానికంగా మాత్రం "పంట నష్టాలు, ఆదాయం లేక రైతు ఇలాంటి మార్గానికి వెళ్లాడేమో" అనే చర్చ మొదలైంది.

**కేసు నమోదు మరిన్ని అనుమానితుల కోసం విచారణ**

ఈ ఘటనపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సాగులో మరెవరైనా ప్రమేయం ఉందా? ఎవరైనా కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారా? అన్న కోణాల్లో విచారణ కొనసాగుతోంది. కొద్దుగూడ గ్రామం పరిసర ప్రాంతాలను పోలీసులు డ్రోన్ సర్వే ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు కూడా సమాచారం. స్థానిక ప్రజలు ఆందోళన



వ్యక్తం చేస్తూ "ఇప్పుడే చర్యలు తీసుకోకపోతే ఇలాంటి సాగులు అడవిప్రాంతాల్లో పెరిగిపోతాయి" అంటున్నారు. పోలీసులు మాత్రం "నిషేధిత పంటలపై జీరో టాలరెన్స్" విధానంతో ముందుకు వెళ్తున్నట్లు స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ టిక్కెట్‌పై అసంతృప్తి

((మొదటి పేజీ తరువాయి)

"పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు వెనక్కి తగ్గలేదు. ఇప్పుడు నన్ను పక్కన పెట్టడం బాధ కలిగించింది. నేను సీనియర్ నాయకుడిని, ఎప్పుడూ ఓటమి చవిచూడలేదు. ఇప్పుడు అవకాశం ఇస్తే గెలిచేవాడిని" అని ఆయన వ్యాఖ్యానించారు. కరోనా సమయంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను గుర్తుచేసుకుంటూ, ఆ సమయంలోనే తన ప్రాణం మీదకు వచ్చిందని, అయినా పార్టీ కోసం పని ఆపలేదని తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడమే లక్ష్యమని, ఆ దిశగా పార్టీ బలపడాలంటే త్యాగం చేసిన నాయకులను గుర్తించాలని ఆయన సూచించారు. తాను హైదరాబాద్ కాంగ్రెస్ కోసం ఎన్నో సంవత్సరాలు శ్రమించానని, రెండుసార్లు జిల్లా అధ్యక్షుడిగా పని చేశానని చెప్పారు.



అంజన్ కుమార్ పోటీ చేస్తే మంచిదని అనుకుంటున్న వారిలో తానే ముందున్నానని మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా ముందు స్పష్టం చేశారు. "హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీకి అంజన్ గారు పెద్ద బలమయ్యారు. ఆయన నాయకత్వం పార్టీకి అవసరం. ఉప ఎన్నికల్లో పార్టీ బలంగా పోటీ చేస్తుంది" అని చెప్పారు. ఈ పరిణామాలతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు కాంగ్రెస్ చర్చలు వేడెక్కాయి. అంజన్ కుమార్ బుజ్జగింపుతో పార్టీ లోపల సంక్షోభం తగ్గుతుందో లేదో చూడాలి.

# సీపీజీఈటీ రెండో దశ ప్రవేశాలకు పూర్తి షెడ్యూల్ విడుదల




((మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని ఉస్మానియా, కేకేఆర్ యూనివర్సిటీ, తెలంగాణ యూనివర్సిటీ, పాలమూరు, శతావాహన, మహాత్మా గాంధీ యూనివర్సిటీ తదితర విశ్వవిద్యాలయాల పరిధిలోని పీజీ కోర్సులకు సీట్లు పొందేందుకు ప్రయత్నిస్తున్న వేలాది మంది విద్యార్థులకు ఇది కీలక దశగా భావిస్తున్నారు. ప్రొఫెసర్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ రెండో దశ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే జరగనున్నాయని, విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు.

`అధికారిక షెడ్యూల్ ఇలా ఉంది

అక్టోబర్ 10 నుంచి 14 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకుని సర్టిఫికెట్లను అప్లోడ్ చేసే అవకాశం ఉంటుంది. ఈ దశలో ఆధార్, ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్, మార్కుల మెమోలు, కాస్ట్ సర్టిఫికెట్, మినారిటీ/నాన్ మినారిటీ ధృవీకరణ లాంటి అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. అక్టోబర్ 15న సర్టిఫికేట్ వెరిఫికేషన్ వివరాలు వెబ్ సైట్‌లో అందుబాటులోకి తీసుకురానున్నారు. అనంతరం అక్టోబర్ 15, 16 తేదీల్లో అభ్యర్థులు తాము కోరుకున్న యూనివర్సిటీ, కోర్సు, కాలేజీలకు సంబంధించి వెబ్ ఆప్షన్లను ఎంచుకోవచ్చు. ఒకవేళ ఆప్షన్ సెలక్షన్‌లో మార్పులు చేయాల్సి వస్తే అక్టోబర్ 17న ఎడిట్ చేసే అవకాశం ఉంటుంది.

**`సీట్ల కేటాయింపు - కాలేజీల్లో రిపోర్టింగ్**

అక్టోబర్ 21న ప్రాథమిక సీట్ల కేటాయింపు జాబితాను విడుదల చేసి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎవరికైతే సీట్లు కేటాయించబడతాయో వారు అక్టోబర్ 24వ తేదీలోగా తాము ఎంపికైన కాలేజీల్లో హాజరై అవసరమైన ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలి. కాలేజీలో ఫీజు చెల్లింపు, ఒరిజినల్ సర్టిఫికెట్ల సమర్పణ, అడ్మిషన్ కన్ఫర్మేషన్ లాంటి ప్రక్రియలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయకపోతే సీటు ఆటోమేటిక్‌గా రద్దవుతుందని హెచ్చరించారు.

**`విద్యార్థులకు సూచనలు**

వెబ్ ఆప్షన్ల ఎంపికలో జాగ్రత్త వహించాలని, తాము చేరాలనుకునే కోర్సు, యూనివర్సిటీ ప్రాధాన్యతను ముందే నిర్ణయించుకుని ఆ తరువాతే ఆప్షన్లు ఇవ్వాలని సూచించారు. ర్యాంక్, కేటగిరీ, స్థానిక/నాన్ లోకల్ స్థితి, ప్రత్యేక రిజర్వేషన్లు లాంటి అంశాల ఆధారంగా సీట్లు కేటాయించబడతాయని యూనివర్సిటీ స్పష్టం చేసింది. ఇతర వివరాల కోసం అధికారిక సీపీజీఈటీ వెబ్‌సైట్‌ను తరచూ సందర్శించాలని, హెల్ప్ డెస్క్ నంబర్లు, అభ్యర్థుల కోసం విడుదల చేసే గైడ్‌లైన్ ఫైల్‌ను పూర్తిగా చదవాలని సూచించారు.



# అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 10, తెలంగాణ ముచ్చట్లు,;** జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మరియు నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు మహ్మద్ జావేద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశానుసారం, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి దరఖాస్తులను కోరడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేయుగలరు. వారి దరఖాస్తుతో పాటు తమ బయోడేటాకాపీని రేపు ది 11 102025 న ఉదయం 10.00 గంటల నుండి జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో అందజేయాలని కోరారు. ఆ దరఖాస్తులను ఏ ఐ సి సి అబ్జర్వర్ క్షుణ్ణంగా పరిశీలించి అధ్యక్షుని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 01.00 గంటల నుండి సాయంత్రం 07.00 గంటల వరకు నాయకులకు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో ఏ ఐ సి సి అబ్జర్వర్ అందుబాటులో ఉంటారని తెలియజేశారు.




# బీసీ రిజర్వేషన్లు అడ్డుకున్న బిజెపి భారీ మూల్యం చెల్లించక తప్పదు

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్,
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 10 , తెలంగాణ ముచ్చట్లు;** బీసీ బిల్లును 9 వ షెడ్యూల్లో చేర్చకుండా గవర్నర్ దగ్గర రాష్ట్రపతి దగ్గర పెండింగ్లో పెట్టి ఈసీలకు తీరని అన్యాయం చేసినటువంటి బిజెపి పార్టీ ముమ్మాటికి బీసీల ద్రోహి అని, రాబోయే ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణవరపు శ్రీనివాస్ హెచ్చరించారు. రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ప్రదర్శనలు ధర్నాలు ర్యాలీలు చేయబోతున్నామని బి సీలకు ద్రోహం చేసిన ఎవరిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఖమ్మం నగరంలోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి మాట్లాడారు. బీసీల నోటి కాడ కూడుని లాక్కున్న రాజకీయ పార్టీలని వదిలిపెట్టమని అన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగనబోయిన పుల్లారావు మాట్లాడుతూ విద్య ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల ద్వారా బీసీ బిడ్డల బతుకులు మారుతాయని ఎదురుచూస్తున్న బీసీలకు సాంకేతి కారణాలు చూపించి అన్యాయం చేస్తున్న రాజకీయ పార్టీలు పద్ధతి మార్చుకోవాలని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మసనం శివరామకృష్ణ మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల్లో బీసీలు గుణపాఠం చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు కేతేపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు అమృతం మల్లికార్జున్, కార్యదర్శి మసనం శివ నాగేశ్వరరావు, కల్లూరు మండల ప్రధాన కార్యదర్శి మోడేపల్లి వెంకటాచారి ,యువజన విభాగం అధ్యక్షులు కూరపాటి సతీష్, మహిళా విభాగం నాయకురాలు చెన్న ఉమా తదితరులు పాల్గొన్నారు..




# ఎన్నికల హామీల్లో ప్రకారంగానే 42 శాతం బీసీ రిజర్వేషన్

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 10, తెలంగాణ ముచ్చట్లు;** కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంది కాబట్టే కేబినెట్ లో ఆమోదం పొందుపరిచి బీసీ రిజర్వేషన్ ప్రవేశపెట్టిందని కార్పొరేట్, బీసీ సంఘం నాయకులు కమర్తపు మురళీ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ తోనే ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ పోతుందని తెలిపారు. రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారంగానే 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధించుకుంటామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ బీసీ రిజర్వేషన్ కు అడ్డుపడుతుందని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా బీసీ రిజర్వేషన్ బిల్లు ఆగే ప్రసక్తే లేదని అయన తెలిపారు. కేబినెట్ లో మంత్రులు బీసీ రిజర్వేషన్ బిల్లుపై చర్చ జరిగిన తర్వాత కోర్టులో పిటిషన్ వేసి వాదులను వినిపించి బీసీ రిజర్వేషన్ బిల్లు సాధించుకుంటామన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ జోహార ఫాతిమా, మార్కెట్ కమిటీ చైర్మన్ యారగర్ల హనుమంతరావు కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీతో రైతుల్లో కొత్త ఉత్సాహం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**పెద్దమందడి,అక్టోబర్10(తెలంగాణ ముచ్చట్లు):** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యత అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు విత్తనాలను అందజేశారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ..“రైతుల శ్రమే దేశానికి బలం. అందుకే రైతుల భరోసా కోసం, పంటల ఉత్పత్తి పెంపు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తోంది. గతంలో రైతులను మోసం చేసిన పాలకులకన్నా, రైతు కోసం పనిచేసే ప్రభుత్వం ప్రజలకు అవసరం” అని చెప్పారు. అయన గత ప్రభుత్వంపై విరుచుకుపడుతూ -“పది సంవత్సరాల పాలనలో రాయితీ విత్తనాలు, ఎరువులు, పరికరాలు ఇవ్వకుండా రైతులను నిరాశలోకి నెట్టారు.కానీ ఇప్పుడు రైతులకు ఉచిత విత్తనాలు, రాయితీ ఎరువులు అందించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన రైతు మిత్రంగా నిలుస్తోంది” అని పేర్కొన్నారు.పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులపై లక్షల కోట్ల ఖర్చు పెట్టి ఒక్క ఎకరానికి నీళ్లు అందించని ప్రభుత్వంపై కూడా విమర్శలు చేశారు.“కేవలం కమీషన్ల కోసం ప్రాజెక్టులు వాడుకున్నారు. పాలమూరు సస్యశ్యామలంగా ఉండటానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమే” అని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, ప్రతి ఏడాది రూ.25 వేల కోట్ల నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు.రైతులు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.వనపర్తి నియోజకవర్గానికి ఈ సీజన్లో మొత్తం 2,500 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉంటాయని, అందులో మొదటి విడతగా 890 క్వింటాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ అధికారులు రైతులు పాల్గొన్నారు.






# ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి...

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -10, తెలంగాణ ముచ్చట్లు;** ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ ను జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ పి.హెచ్.సి. లలో పని చేసే ప్రతి సిబ్బంది అటెండెన్స్ ఆన్ లైన్ చేసి 100 శాతం మానిటరింగ్ చేయాలని అన్నారు. ప్రసవ సమయంలో తల్లి మరణాలకు సంబంధించి కేసులు పరిశీలిస్తే రెండవ ఏ.ఎన్.సి. చెక్ అప్ ప్రైవేట్ ఆసుపత్రిలో చేసుకున్నట్లు తేలిందని, దీనికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. గత సంవత్సర కాలంగా ప్రతి ఆశా కార్యకర్త పరిధిలో మొదటి, రెండు ఏ.ఎన్.సి. చెక్ అప్ ప్రైవేట్ ఆసుపత్రులలో జరిగిన కేసులు పరిశీలించి రిపోర్టు అందించాలని, దీనికి గల బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి వైద్యాధికారి తన పరిధిలోని ఆశా కార్యకర్తలతో రెగ్యులర్ గా సమావేశాలు పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. గర్భిణీ లకు చికిత్స అందించడంలో నిర్లక్ష్యం వహించిన ప్రైవేట్ ఆసుపత్రులపై కూడా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆశా కార్యకర్తలు రెగ్యులర్ గా తమ పరిధిలో ఇంటింటి సర్వే చేస్తూ గర్భిణి మహిళల వంద శాతం ఏ.ఎన్.సి. రిజిస్ట్రేషన్ పూర్తి అయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల దగ్గర ఉన్న వసతులు ప్రైవేటు ఆసుపత్రులలో లేవని, ప్రభుత్వ ఆసుపత్రులలో అధికంగా ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వీలైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సి సెక్షన్ డెలివరీలను నివారించాలని అన్నారు. అధికంగా సి సెక్షన్ జరుగుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల పై నిఘా పెట్టాలని, ప్రతి సెక్షన్ ఆపరేషన్ పై ఆడిట్ రిపోర్ట్ ఉండాలని అన్నారు. జిల్లాలో అనవసరంగా సి సెక్షన్ డెలివరీలను చేసే ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆశా కార్యకర్తలు ప్రతి గర్భిణీ స్త్రీ ను ఫాలో అప్ చేస్తూ ఉచితంగా మన ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు జరిగేలా చూడాలని అన్నారు. ప్రతి పి.హెచ్.సి. పరిధిలో వంద శాతం పిల్లలకు టీకాలు వేయించాలని, వైద్య అధికారులు టీకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి ఆశా కార్యకర్త ఫాలో అప్ చేయాలని అన్నారు. ప్రతి పి.హెచ్.సి. పరిధిలో ఎన్.సి.డి. సర్వే పూర్తి చేసి వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, వైద్య అధికారులు తమ పరిధిలో ఆశా కార్యకర్తలతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని అన్నారు. ఎన్.సి.డి. సర్వే నిర్వహణలో ఆశా కార్యకర్తలు, ఏ.ఎన్.ఎం, ఎం.ఎల్.హెచ్.పి. పాత్ర ఎంత ఉండాలో నిర్దేశించుకోవాలని అన్నారు.ప్రతి పి.హెచ్.సి. పరిధిలో డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. గత సంవత్సరం కంటే 58 శాతం డెంగ్యూ కేసులు నేడు తగ్గాయని, దీనికి కృషి చేసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. పారిశుద్ధ్య సమస్యల వల్ల కేసులు అధికంగా నమోదవుతున్న గ్రామాల జాబితా అందించాలని అన్నారు.టీబీ నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, నిర్దేశించిన లక్ష్యం మేరకు అనుమానితులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా వైద్య పరీక్షల ఫలితాలు త్వరగా అందించేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల లో పరీక్షలు జరిగినప్పుడు ప్రజలకు మనపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రతి పి.హెచ్.సి.కి లక్ష్యాలు కేటాయించి వైద్య పరీక్షల శాంపిల్స్ సేకరించాలని అన్నారు. డయాగ్నోస్టిక్ హబ్ నిర్వహణకు అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని, ప్రతి రోజూ పూర్తి సామర్థ్యంతో టీహబ్ పని చేయాలని అన్నారు. పి.హెచ్.సి. పరిధిలో సికిల్ సెల్ అనీమియా క్యారియర్స్ కు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అనంతరం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి, వివిధ ప్రోగ్రాం అధికారులు, వైద్య అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌ను కోరిన పరమేశ్వర్‌రెడ్డి

## కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజుతో కలిసి వినతిపత్రం సమర్పణ

**మేడ్చల్, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పలు ప్రాథమిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మేడ్చల్‌మల్కాజి గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఐ.ఏ.యస్. కి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజుతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించి, వినతిపత్రం అందజేశారు.పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ “ఉప్పల్ నియోజకవర్గంలో భూసమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఉప్పల్, కాప్రా మండల పరిధిలో ప్రభుత్వ భూములపై కొందరు ఆక్రమణలు చేస్తున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకు అధికార యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలి,” అన్నారు.అలాగే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆరోగ్య కేంద్రాలకు తగిన స్థలాలను కేటాయించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.మరియు కాప్రా, చెర్లపల్లి, నాగారం ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల లోపాలను వివరించారు. పౌరసౌకర్యాల మెరుగుదలకు అవసరమైన నిధులు కేటాయించాలనీ, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ మను చౌదరి ఈ అంశాలపై సానుకూలంగా స్పందించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి కుమార్, గణేష్, శంకర్ పాల్గొన్నారు.



శనివారం-11- అక్టోబర్ 2025

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్: పొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# సత్తుపల్లి పట్టణంలో ఓటు హక్కు రక్షణ కోసం కాంగ్రెస్ నేత మట్టా దయానంద్ పిలుపు

**సత్తుపల్లి, అక్టోబరు 10 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గం కేంద్రంగా ఓటర్ల హక్కులను రక్షించడానికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఓటు హక్కు ఉల్లంఘనలను నివారించే సంతకాల ఉద్యమం శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రారంభమైంది.
ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. "మా ఓట్ల హక్కును రక్షించండి" అనే నినాదంతో ప్రజల నుండి సంతకాలను సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితాల్లో తారుమారులు జరుగుతున్నాయని, పౌరుల హక్కులను ఉల్లంఘించే చర్యలను వెంటనే నిలిపివేయాలని భారత ఎన్నికల సంఘానికి వినతి పత్రం అందజేస్తామని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గం సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల సంతకాలను సేకరించి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి అందజేస్తామని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని దయానంద్ స్పష్టం చేశారు.
కార్యక్రమంలో సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మాజీ కౌన్సిలర్లు దూదిపాల రాంబాబు, చల్లగుళ్ల నరసింహ రావు, కమల్ పాషా, ఐ. శ్రీను, మానుకోట ప్రసాద్, పింగళి సామెలు, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కుమారి, పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సందీప్ గౌడ్, మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.




## సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు లోయర్ సీలేరు పవర్ ప్లాంట్ సందర్శన

**సత్తుపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండల పరిధిలోని బి గంగారం గ్రామంలో సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) మరియు డిప్లొమా విద్యార్థులు పారిశ్రామిక శిక్షణ కార్యక్రమం భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఈస్ట్ గోదావరి జిల్లా మోతుగూడెం మండలంలో ఉన్న లోయర్ సీలేరు పవర్ ప్లాంట్‌ను సందర్శించారు.
ఈ సందర్శన సందర్భంగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి అన్నారు, విద్యార్థులు తమ సబ్జెక్టులలో తెలివితేటలు, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఇటువంటి పారిశ్రామిక సందర్శనలు ఎంతో అవసరం.
విభాగాధిపతి కె.రామకృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, ఇంజనీరింగ్ కోర్సు విద్యార్థుల కెరీర్‌లో పారిశ్రామిక సందర్శనలకు ప్రాధాన్యత ఉందని, ఇది సబ్జెక్టుల సైద్ధాంతిక జ్ఞానానికి ఆచరణాత్మక అవగాహనని కల్పించిందని తెలిపారు. పారిశ్రామిక సందర్శనల ద్వారా విద్యార్థులు కంపెనీల అంతర్గత పనితీరు, ఆధునిక ఆటోమేషన్ విధానాలు, భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలపై అవగాహన పొందవచ్చని, వాస్తవిక పరిశ్రమ పరిసరంలో సొంత అనుభవం సంపాదించగలరని చెప్పారు.
కళాశాల సెక్రటరీ మరియు కస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, విద్యార్థులను పవర్ ప్లాంట్‌లో గైడ్ చేస్తూ, విద్యార్థులకు విద్యా పరంగా పవర్ మూలాల విలువ, భవిష్యత్తు తరాలకు విద్యుత్ మరియు నీటి పరిరక్షణ అవసరం, వాటిని సరైన విధంగా వినియోగించుకోవాల్సిన అవసరం గురించి వివరించారు. ఈ కార్యక్రమాన్ని విభాగాధిపతి ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు విజయవంతంగా నిర్వహించారు. పర్యవేక్షణలో షేక్ సైదులు, కె. ప్రతిమ, యన్ జి వి. కృష్ణ పాల్గొన్నారు.





# స్పైసీ బావర్చి రెస్టారెంట్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభం

**నాగారం, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ రాంపల్లి ఆర్టీసీ కాలనీలో కొత్తగా స్థాపించిన స్పైసీ బావర్చి రెస్టారెంట్ ను మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే, "ప్రజల టేస్ట్ మరియు ఇష్టాలను దృష్టిలో ఉంచుకుని, ఉత్తమ నాణ్యమైన భోజనం అందించడం మా ముఖ్య లక్ష్యం" అని తెలిపారు.రెస్టారెంట్ ప్రారంభ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు సరితా రమేష్, నాగేష్ గౌడ్, గోక యాదగిరి, లక్ష్మీ వేణుగోపాల్, అనంతరెడ్డి, మోకు జగన్మోహన్ రెడ్డి, కొమురెల్లి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు అంజయ్య గౌడ్, పెంటయ్య గౌడ్, మచ్చా శ్రీనివాస్ గౌడ్, నర్సింహారెడ్డి, సాయినాథ్ గౌడ్, రామ్ రెడ్డి, లక్ష్మారెడ్డి, హరికృష్ణ, శబ్బుఖాన్, వాహిద్ బెజగం, నవీన్, ఆంజనేయులు మరియు రెస్టారెంట్ ప్రొప్రైటర్ షేర్ అలీ ఖాన్, వారి తనయుడు రిజ్వాన్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.ఈ కొత్త రెస్టారెంట్ ద్వారా స్థానికులు సాంప్రదాయ వంటకాలు మరియు ఆధునిక రుచులను అనుభవించగలరు అని అధికారులు పేర్కొన్నారు.




## గిరిజన హాస్టల్ వర్కర్స్ సమ్మె 29వ రోజుకు చేరింది.!

**సత్తుపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పని చేసే డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఎన్నికలకు ముందే కాంగ్రెస్ హామీ ఇచ్చిన అంశాలను అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్ తో సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సమ్మె శుక్రవారంతో 29వ రోజుకు చేరింది.
సమ్మెను సందర్శించిన సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విఠల్ రావు కార్మికులకు మనోధైర్యం ఇచ్చారు. సమ్మె సాధ్యమైనంతవరకు కొనసాగిస్తూ, సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేవరకు పట్టు సడలించకపోవాలని తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు తదితరులు శనివారం నుండి సమ్మెను మరింత ఉద్రిక్తంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు. సమ్మెలో సుశీల, వెంకటేశ్వరరావు, పార్వతి, రాఘవమ్మ, సత్యనారాయణ, పద్మ, గౌరీ లక్ష్మీ పాల్గొన్నారు.







# ఘనంగా నాగారం ఉన్నత పాఠశాలలో సైన్స్ ఫెయిర్

**నాగారం, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** నాగారం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనగా సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కీసర మండల విద్యాశాఖ అధికారి జమదగ్ని, చీర్యాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ప్రధానోపాధ్యాయులు పి.సి. రాములు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో అనేక శాస్త్రీయ నమూనాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. సైనికులకు చలికాలంలో వేడిగా ఉండే సోలార్ ప్యానెల్ కోట్లు, ఫ్యాక్టరీల నుండి వెలువడే కాలుష్యాన్ని ఫిల్టర్ చేసే యంత్ర నమూనాలు విశేషంగా ఆకర్షించాయి.ఈ సైన్స్ ఫెయిర్‌ను అగస్త్య ఫౌండేషన్ సభ్యులు త్రివేణి, అఫ్షాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు రమా సత్య శ్రీ, కమల, అర్చన, సంధ్యా రాణి, వందనా పర్యవేక్షణలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, అరవింద్ కుమార్, రఘు, శ్రీదేవి, అజీజ్ అహ్మద్, పద్మ, గాయత్రి, వరమ్మ, సంజయ్ రాణీ, పాండురంగ రెడ్డి, సుప్రజ, విద్యా వాలంటీర్లు స్వప్న, పావని, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



## అసైన్డ్ భూముల అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటాం

### కాప్రా తహసిల్దార్ సుచరిత

**కాప్రా, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడలో అసైన్ భూములపై జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా తహసిల్దార్ సుచరిత స్పష్టం చేశారు.శుక్రవారం ఆమె కుషాయిగూడ జమ్మిగడ్డ వద్ద ఉన్న అర్చిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలోని అసైన్ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తక్షణమే నిర్మాణాలను తొలగించి, భూమికి ఫెన్సింగ్ ఏర్పాటుచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా అధికారులకు ఇటీవల అసైన్డ్ భూములను అక్రమంగా లే అవుట్ చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎమ్మార్వో విచారణ జరిపినట్లు సమాచారం. విచారణలో ఆ భూములు అసైన్ భూములేనని నిర్ధారణ అయింది. తహసిల్దార్ సుచరిత మాట్లాడుతూ, "అసైన్డ్ భూములపై ఎటువంటి నిర్మాణాలు అనుమతించబోవు. చట్టపరమైన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.

# చదువులలో ప్రతిభ కనబరుస్తున్న గిరిజన బిడ్డలకు సహకారం అందిస్తా

### ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**కుషాయిగూడ, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఉన్నత చదువులలో ప్రతిభ కనబరుస్తున్న గిరిజన విద్యార్థులకు అండగా ఉంటూ, వారి కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.
గ్రూప్-1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా ఎంపికైన దిరావత్ సబితను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం ఏఎస్ రావు నగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌తో కలిసి నాగార్జున నగర్‌లోని ఆమె నివాసంలో శాలువా కప్పి సన్మానించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "గిరిజన విద్యార్థులు ఉన్నత చదువుల్లో ప్రతిభ చూపడం సమాజానికి గర్వకారణం. సబిత విజయాన్ని చూసి మరెందరో యువత ప్రేరణ పొందుతారు. ఇలాంటి ప్రతిభావంతుల విద్యార్థులకు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు అండగా నిలవాలి" అని అన్నారు. డీఎస్పీగా బాధ్యతలు చేపట్టి ప్రజలకు సానుకూలమైన, పారదర్శకమైన పరిపాలన అందించాలని ఆమెకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, చర్లపల్లి కాలనీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, పాండాల శివకుమార్ గౌడ్, సారా వినోద్ ముదిరాజ్, శ్రీశైలం, ప్రసాద్ రెడ్డి, జై కృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత సాధించడంలో కాంగ్రెస్ వైఫల్యం

## మాజీ ఎంపీ నామ



**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 10 , తెలంగాణ ముచ్చట్లు:** బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యమైందని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో.9పై హైకోర్టు స్టే ఇవ్వడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయమై నామ స్పందిస్తూ బీసీల హక్కులు, అవకాశాలను రక్షించాల్సిన బాధ్యత ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిందని ఆయన విమర్శించారు. నాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ పార్టీలకు అతీతంగా అందరిని కలుపుకొనిపోయి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు. కానీ నేడు రాష్ట్రం లో బీజేపీ, కాంగ్రెస్ నుండి పదహారు మంది ఎంపీలు వుండి కూడా బీసీ రేజర్వేషన్ల విషయమై ఏనాడు కూడా పార్లమెంట్ ను స్థంబింపజేయలేదని, కనీసం వారి హక్కుల కోసం పోరాటం చేయలేదన్నారు. రెండు పార్టీలు కూడా బీసీ లను మోసం చేశాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీల ద్వంద వైఖరి కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని, ఇప్పటికైనా పార్లమెంటులో చట్టం ద్వారా బీసీ రిజర్వేషన్ల పెంపునకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కేసీఆర్ సూచనలు మేరకు బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిన తీరు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆయన కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని సక్రమంగా సిద్ధం చేయకపోవడం, చట్టపరమైన ప్రక్రియలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు బీసీ వర్గాల అభ్యున్నతి పేరుతో గొప్ప హామీలు ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వాగ్దానాలను మరిచిపోయిందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం చట్టబద్ధమైన మార్గంలో ముందుకు సాగకపోవడం వల్ల బీసీ వర్గాల ఆత్మగౌరవం దెబ్బతింటోందని మాజీ ఎంపీ నామ ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు తర్వాత అయినా కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల హక్కులు, ప్రయోజనాలను కాపాడే దిశగా సక్రమమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. బీఆర్ఎస్ పాలనలో బీసీలకు గౌరవం, హక్కులు రెండూ సమానంగా లభించాయి. కానీ కాంగ్రెస్ పాలనలో మళ్లీ నిర్లక్ష్యం తాలూకు చీకట్లు కమ్ముకుంటున్నాయన్నారు. బీసీల హక్కులు, గౌరవం రక్షించడంలో బిఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందన్నారు.



# జిల్లెల్ ఆదిత్య రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

**ఖిల్లా ఘనపూర్ మండల కాంగ్రెస్ నాయకులు**

**వనపర్తి,అక్టోబర్10(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ చిన్నారెడ్డి కుమారుడు, యువ కెరటం పిలిస్తే పలికే నాయకుడు డాక్టర్ జిల్లెల్ ఆదిత్య రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ.. వనపర్తి జిల్లా వికలాంగుల కమిటీ అధ్యక్షుడు గంజాయి రమేష్ శాలువాతో సన్మానించారు. వనపర్తి జిల్లా లోని నాయకులు ఈ సందర్భంలో జిల్లెల్ ఆదిత్య రెడ్డి జీవితాన్ని, విశిష్టతను, ప్రజల సేవలో చూపిన నాయకత్వాన్ని, నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉన్నతమైన రాజకీయ పదవులలో తండ్రికి తగ్గ తనయుడుగా వెలుగొందినందుకు అభినందించారు. నిరుపేద ప్రజలకు మరిన్ని పథకాలను తీసుకురావాలని, ప్రజల గుండెల్లో నిలిచే నాయకుడు అవుతారని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దేవన్న యాదవ్, ఖిల్లా గణపురం మండలం యూత్ కాంగ్రెస్ నాయకులు మున్నూరు జయకర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డికి మంత్రిపొంగులేటి శుభాకాంక్షలు



**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 10, తెలంగాణ ముచ్చట్లు;** తెలంగాణ రాష్ట్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు రామసహాయం సురేందర్ రెడ్డి 94వ జన్మదినాన్ని శుక్రవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిపొంగులేటి పూల బోకే అందజేసి సురేందర్ రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని ప్రశంసించారు. ఆయన దీర్ఘాయుష్మాన్ కావాలని, ఆరోగ్యంగా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు.





# దక్షిణ అయోధ్యకు 'నూతన'శోభ

- భద్రాద్రి రామాలయం అభివృద్ధి పనులకు వేగం పెంచాలి
- టిటిడి ఆధ్వర్యంలో ఖమ్మంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం
- దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో మంత్రి"తుమ్మల" సమీక్ష

**ఖమ్మం బ్యూరో,అక్టోబర్ 10, తెలంగాణ ముచ్చట్లు;** దక్షిణ అయోధ్య భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయానికి నూతన శోభ సంతరించుకొనుందని ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పనులు శరవేగంగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌తో పాటు ఆలయ అభివృద్ధి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు దిశ నిర్దేశం చేశారు. ఆయన మాటల్లో ఇలా....

మాడ వీధుల విస్తరణకు దిశానిర్దేశం...

"ఆలయ విస్తరణ కోసం భూసేకరణ పూర్తయింది. ఇప్పుడు ఆలయం చుట్టూ ఉన్న మాడ వీధుల విస్తరణ పనులు, ప్రాకార గోడల నిర్మాణాలు తక్షణమే ప్రారంభించాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఆగమ శాస్త్ర ప్రమాణాలకు అనుగుణంగా ఆర్కిటెక్ట్ రూపొందించిన డిజైన్లను ఫైనల్ చేసి ఆలయ రూపకల్పనను వేగవంతం చేయాలని సూచించారు.

ఆగమశాస్త్రానికి అనుగుణంగా రూపకల్పన....

ఆలయ నిర్మాణంలో ప్రతి అంశం ఆగమ శాస్త్రం ప్రకారం ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. "భద్రాద్రి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. దీనిలో ఏ దశలోనూ నిర్లక్ష్యం ఉండరాదు" అని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం....

భక్తులకు వసతి, రవాణా, పార్కింగ్, నీటి సదుపాయాలు వంటి మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. భద్రాద్రి రామాలయం పునరుద్ధరణ పూర్తయిన తర్వాత దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించేలా ఉండాలని అన్నారు.

అభివృద్ధి పనులపై నిరంతర పర్యవేక్షణ....

ఆలయ అభివృద్ధి పనులు సమయ పాలన ప్రకారం సాగుతున్నాయో లేదో నిరంతరంగా పర్యవేక్షించాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. ప్రతి దశ పనుల పురోగతిపై అధికారులు సమయానుకూల నివేదికలు సమర్పించాలని సూచించారు.భద్రాద్రి రామాలయం పునరుద్ధరణ పనులు పూర్తయిన వెంటనే అక్కడ విశాలమైన యజ్ఞశాల, రామకోట మాడ వీధులు, ఆధునిక కట్టడాలతో కొత్త చరిత్ర సృష్టించనున్నట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రంలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనం లక్ష్యం...

రాష్ట్రంలోని ప్రాముఖ్యమైన దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడేలా దేవాదాయ శాఖ పనులు పారదర్శకంగా కొనసాగుతున్నాయని, భద్రాద్రి రామాలయం అభివృద్ధి ద్వారా తెలంగాణలో ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి నాంది పలుకుతుందని అన్నారు.

ప్రభుత్వం భక్తుల నమ్మకాన్ని కాపాడే విధంగా దేవాదాయ శాఖను పారదర్శకంగా నడిపిస్తోంది. ఆలయాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుతూ అభివృద్ధిని సమతుల్యంగా కొనసాగిస్తాం" అని మంత్రి స్పష్టం చేశారు.

ఖమ్మంలో టిటిడి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కోసం మూడు అనువైన ప్రాంతాలను జిల్లా కలెక్టర్ టిటిడి అధికారులకు ప్రతిపాదించినట్లు తెలిపారు. "సోమవారం టిటిడి అధికారులు ఖమ్మం నగరానికి వచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపి ఆలయ స్థలాన్ని ఖరారు చేస్తారని మంత్రి తుమ్మల వెల్లడించారు.

ఈ కొత్త ఆలయం నిర్మాణం పూర్తయితే ఖమ్మం జిల్లాలో భక్తి, పర్యాటక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. తిరుమల తత్వం, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో భక్తులకు మరింత దగ్గరగా ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడుతుందని తుమ్మల అన్నారు.

# బీఆర్ఎస్ నాయకుల ప్రవర్తన సిగ్గుచేటు

**బస్‌భవన్ వద్ద బస్సులు అడ్డుకోవడం దారుణం – కొలిపాక సతీష్**



**స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ పార్టీ నాయకులు బస్‌భవన్ వద్ద బస్సులను అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నం సిగ్గుచేటు చర్యగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్ తీవ్రంగా విమర్శించారు. డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో 10 సంవత్సరాలపాటు కేసీఆర్ ప్రభుత్వం పాలనలో ఆర్టీసీ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఆ బాధలు ప్రజలు ఎప్పటికీ మరవలేరని అన్నారు. తమ హక్కుల కోసం పోరాడిన ఆర్టీసీ కార్మికులను బెదిరించి ఉద్యోగాల నుండి తొలగించమని యత్నించినవారు ఎవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఆర్టీసీని ప్రైవేటీకరించేందుకు ప్రయత్నించి 48 వేల మంది ఉద్యోగులను రోడ్డున పెట్టినవారు బీఆర్ఎస్ నేతలేనని సతీష్ గుర్తు చేశారు. ఆందోళన చేసిన కార్మికులపై కేసులు పెట్టడం, మహిళా ఉద్యోగులను పిల్లలతో పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టడం వంటి అమానవీయ ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "మీ పాలనలో ఆర్టీసీ ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు, గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయారు. ఇవన్నీ మర్చిపోయి ఇప్పుడు బస్‌భవన్ వద్ద కార్యక్రమాలు చేయడం సిగ్గుశరం కాదు?" అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ పునరుద్ధరణ దిశగా పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకువచ్చిందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం, 2 వేల కండక్టర్ పోస్టుల భర్తీ, 1,300 డ్రైవర్-శ్రామిక పోస్టుల నియామకం, మూడు కొత్త బస్ డిపోల మంజూరులు కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమయ్యాయని వివరించారు. "ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకొని అభివృద్ధికి సహకరించాలి" అని కొలిపాక సతీష్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా నాయకులు మామిడ్ల శ్రీనివాస్, గట్టు కోటి, నక్క పాపయ్య, గట్టు సురేందర్, గట్టు ఎల్లయ్య, జంపాల శ్రీకాంత్, శ్రీనివాస్, తాళ్లపల్లి కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టంను మించిన రేవంత్ అహంకారం



- రాజకీయ లాభం కోసం రిజర్వేషన్లతో ఆట!
- హైకోర్టు స్టే ప్రభుత్వం వైఫల్యానికి చిహ్నం
- మీడియా సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 10, తెలంగాణ ముచ్చట్లు:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్ల బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు విధించిన స్టే రాష్ట్ర ప్రజాస్వామ్య చరిత్రలో కాంగ్రెస్ పాలనకు నల్లపేజీగా నిలిచిందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. శుక్రవారం నాడు ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, "రాజకీయ లాభం కోసం చట్టాన్ని తాకట్టు పెట్టిన ఈ ప్రభుత్వం ఇప్పుడు న్యాయస్థానం చేతిలో చెంపదెబ్బ తిన్నది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రేవంత్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బీసీ వర్గాల మద్దతు సంపాదించాలనే ఉద్దేశంతో తొందరపాటుగా రిజర్వేషన్లను ప్రకటించిందని ఆయన అన్నారు. కానీ ఆ ప్రక్రియలో సుప్రీంకోర్టు స్పష్టంగా సూచించిన 'ట్రిపుల్ టెస్ట్' ప్రమాణాలను విస్మరించిందని కోటేశ్వరరావు మండిపడ్డారు. బీసీ వర్గాల సామాజిక, విద్యా స్థితిగతులపై స్వతంత్ర కమిషన్ నివేదిక లేకుండా, ప్రభుత్వ అంచనాల ఆధారంగా శాతం నిర్ణయించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన తెలిపారు. "ఈ ప్రభుత్వానికి చట్టపరమైన అవగాహన లేకపోవడం కాదు, కావాలనే నిర్లక్ష్యం చేయడం. చట్టం కంటే రాజకీయ లాభం ముఖ్యం అన్న ధోరణి తెలంగాణ పాలనలో స్థిరపడింది" అని ఆయన విసురుగా అన్నారు.హైకోర్టు స్టే వెనుక ఉన్న అసలు కారణం రేవంత్ ప్రభుత్వ అహంకారం, అధికార దుర్వినియోగమేనని కోటేశ్వరరావు అన్నారు. "న్యాయ సలహాలను పట్టించుకోకుండా, అధికారుల సూచనలను పక్కన పెట్టి, కేవలం రాజకీయ ఒత్తిళ్లకు లోనై తీసుకున్న నిర్ణయాలు ఈ అవమానకర పరిస్థితికి దారి తీశాయి. ప్రజాస్వామ్యంలో చట్టం కంటే పెద్దది ఏదీ లేదు. కానీ రేవంత్ ప్రభుత్వం చట్టాన్ని కాళ్ల కింద వేసి పరిపాలన చేస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. హైకోర్టు స్టేతో ఎన్నికల ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయి పంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీలలో పరిపాలన స్తంభించిందని, ప్రజలకు అవసరమైన సేవలు అందడం కష్టమైందని ఆయన వివరించారు. "ప్రజాస్వామ్యాన్ని కాపాడే హక్కు న్యాయవ్యవస్థదే. అందుకే హైకోర్టు ప్రజల తరపున మాట్లాడింది. ఇది కేవలం రిజర్వేషన్లపై తీర్పు కాదు – ఇది రేవంత్ ప్రభుత్వ అహంకారంపై తీర్పు" అని కోటేశ్వరరావు పేర్కొన్నారు. బీసీ వర్గాల అసంతృప్తి రోజురోజుకీ పెరుగుతోందని, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్‌పై విరక్తి వ్యాపిస్తున్నదని ఆయన అన్నారు. "బీసీలు అడుగుతున్నారు – మాకు న్యాయం ఎక్కడ? రిజర్వేషన్ల పేరుతో మోసం చేసిన ఈ ప్రభుత్వం నైతిక హక్కు కోల్పోయింది" అని ఆయన హెచ్చరించారు. బీసీ సమాజాన్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ ఇక రాజకీయంగా తట్టుకోలేదని ఆయన వ్యాఖ్యానించారు. కేవలం రాజకీయ లాభం కోసం చట్టాన్ని ఉల్లంఘించే ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం న్యాయపరమైన పునాదులు లేకుండా నిర్ణయాలు తీసుకుంది. రాజ్యాంగం చెప్పిన సూత్రాలను విస్మరించింది. ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు తప్పకుండా శిక్షిస్తారు" అన్నారు. "హైకోర్టు తీర్పు కేవలం ఒక కేసు కాదు, ఇది ఒక బోధ. చట్టం పైనే రాజకీయం ఉండాలి. చట్టాన్ని లెక్కచేయని నాయకత్వం ప్రజల విశ్వాసం కోల్పోతుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ప్రధానమైన సమస్యలు అలాగే అయిపోయాయని విమర్శించారు. ముగ్గురు మంత్రులు కూడా కేవలం కమిషన్ కోసం ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. ప్రతి పనిలో కూడా కమిషనర్ తీసుకోకుండా మంత్రులు పనిచేస్తున్న దాఖలాలు ఎక్కడా కూడా కనిపించట్లేదని అన్నారు. అంతే కాకుండా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సైతం మేమే తీసుకువచ్చామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నాను. పామాయిల్ సాగు విషయంలో కంపెనీ యజమానులు నకిలీ మొక్కలు పంపిణీ చేసి రైతులను నష్టపరిచినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నకిలీ మొక్కల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారంతో పాటు మొక్కలను కూడా మరల ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న అనేక సమస్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై తక్షణమే పరిష్కారం చూపించకపోతే జిల్లా వ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన ఎదుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గుత్తా వెంకటేశ్వరరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, నాయకులు వీరవల్లి రాజేష్ గుప్తా, కందుల శ్రీకృష్ణ, జిల్లా మీడియా కన్వీనర్ డా.. నెల్లూరు బెనర్జీ, బోయినపల్లి సురేష్, రుద్రగాని మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక

# ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి...



జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -10, తెలంగాణ ముచ్చట్లు,;** ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం నగరంలో మరింత మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టేందుకు సోమవారం (అక్టోబర్ 13) నుంచి ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ 10 రోజుల పాటు చేపట్టడం జరుగుతుందని అన్నారు.

నగర వ్యాప్తంగా పేరుకు పోయిన చెత్తను శుభ్రం చేయాలని, మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జవాన్ నుంచి సహాయ కమీషనర్ వరకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధతో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని అన్నారు. చెత్త తో ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసిన తర్వాత ముందు, ఆ తరువాత తేడాను తెలియజేసేలా ఫోటోలు తీయాలని, ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు అవసరమైన అదనపు లేబర్, ఎక్విప్మెంట్ అందుబాటులో పెట్టడం జరుగుతుందని అన్నారు.

నగరంలోని ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లలో ఎక్కడ చెత్త ఉండకుండా శుభ్రం చేయాలని, వర్షాల వల్ల పేరుకుపోయిన మట్టి తొలగించాలని అన్నారు. జవాన్ వారీగా రోజుకు ఏ ప్రాంతంలో ఎన్ని కిలోమీటర్ల రోడ్లు శుభ్రం చేస్తున్నారు తెలియజేసేలా ప్రొఫార్మా తయారు చేయాలని అన్నారు.

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ క్రింద శానిటేషన్ నిర్వహించిన ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, అక్కడ ఎటువంటి మార్పు లేకుండా అపరిశుభ్రంగా ఉన్నట్లు తెలిస్తే సంబంధిత జవాన్, ఇతర అధికారులపై చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ సందర్భంగా శానిటేషన్ జవాన్, సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు జవాన్ తన పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు ఉదయం సకాలంలో రిపోర్ట్ చేసేలా చూడాలని, అందరికంటే ముందే జవాన్ వచ్చి ఫీల్డ్ లో ఉండాలని, వార్డు అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

నగర వ్యాప్తంగా ఉన్న డ్రైయిన్ పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు. ఏ రోజు తీసిన పూడికతీత అదే రోజు అక్కడి నుంచి తొలగించేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. పబ్లిక్ పార్క్, బస్ స్టాప్స్, పబ్లిక్ టాయిలెట్స్ పూర్తిగా శుభ్రం చేయాలని అన్నారు.

నగరంలో ఉన్న ఖాళీ స్థలాలను 100 శాతం శుభ్రం చేయాలని, అక్కడ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని అన్నారు. ప్రైవేట్ ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకునేలా యజమానులకు నోటిసులు జారీ చేయాలని అన్నారు.

రోడ్డు మీద నిర్మాణ వ్యర్థాలు, ఎక్కడ ఇసుక, కంకర వంటి నిర్మాణ పదార్థాలు ఉండటానికి వీలు లేదని అన్నారు. నగరంలో ఎక్కడ పిచ్చి మొక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగరంలో ఉన్న ఫుట్ పాత్ లను నీటితో కడిగి శుభ్రం చేయాలని అన్నారు. నగరంలో హోటల్స్, వ్యాపార, వాణిజ్య సంస్థలు బయట ఎక్కడైనా చెత్త వేసినట్లయితే వారి లైసెన్సులు రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ ద్వారా వచ్చిన మార్పు స్పష్టంగా తెలియజేసేలా రికార్డు మెయింటెయిన్ చేయాలని అన్నారు. ప్రతి చోట శుభ్రం చేయడానికి ముందు, తర్వాత పరిస్థితులను వివరించేలా ఫోటోలు తీయాలని అన్నారు.

10 రోజులకు సంబంధించి జవాన్ కు కార్యాచరణ అందించాలని అన్నారు. నగరంలో 15 రోజులలో ప్రధాన రహదారిపై ఎక్కడా గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.


ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సూపర్వైజర్, జవాన్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## జిల్లెల్ల ఆదిత్య రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వీరాభిమాని రక్తంతో చిత్రపటం బహుమతి

**మహబూబ్‌నగర్,అక్టోబర్1(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ యువ నాయకుడు,ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ నేషనల్ హెడ్ (హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్) జిల్లెల్ల ఆదిత్య రెడ్డి పుట్టినరోజు సందర్భంగా.. పెద్దమండడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తన అభిమానాన్ని వినూత్నంగా వ్యక్తం చేశారు.తన ప్రియతమ నాయకుడి పట్ల ఉన్న గాఢమైన ప్రేమాభిమానంతో, గట్టు రాజు మహబూబ్‌నగర్ రక్తదాన కేంద్రంలో రక్తం దానం చేసి, తన రక్తంతో స్వయంగా కళాకారుడి సహాయంతో జిల్లెల్ల ఆదిత్య రెడ్డి చిత్రపటాన్ని గీయడం విశేషం. హైదరాబాదులో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని ఆ చిత్రాన్ని ఆదిత్య రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రేమాభిమానాల కానుకగా సమర్పించారు. గట్టు రాజు మాట్లాడుతూ.. జిల్లెల్ల ఆదిత్య రెడ్డి ప్రజల కోసం నిరంతరం కృషి చేసే నాయకుడు. ఆయన ప్రజాసేవా తపన, యువత పట్ల చూపించే ప్రేమ నాకు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. ఆయన పుట్టినరోజు సందర్భంగా నా అభిమానాన్ని వ్యక్తం చేయడానికి నా రక్తంతో ఆయన చిత్రాన్ని గీయడం జరిగింది. ఇది నా హృదయపూర్వక గౌరవం అని తెలిపారు.జిల్లెల్ల ఆదిత్య రెడ్డి స్పందిస్తూ..

ఇలాంటి అభిమానులు నా బలమూ, నా ప్రేరణా. రక్తంతో గీసిన నా చిత్రపటం నాకు ఎంతో భావోద్వేగాన్ని కలిగించింది. గట్టు రాజు చూపిన ప్రేమను నేను ఎప్పటికీ మరిచిపోలేను" అని తెలిపారు.పుట్టినరోజు వేడుకలో హైదరాబాదులో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. గట్టు రాజు గీసిన ప్రత్యేక చిత్రపటం అక్కడి నాయకుల్లో విశేష ఆకర్షణగా నిలిచింది.





# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందజేత

**మల్కాజిగిరి, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి డివిజన్‌కు చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఆర్థిక సహాయం అందించబడింది. మొత్తం రూ.99,000/ విలువైన చెక్కులను శుక్రవారం రోజు బోయిన్‌పల్లి క్యాంప్ ఆఫీస్‌లో శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులు అందుకున్నారు.ఈ సందర్భంగా సూర్యకళకు రూ.51,000/, రవీందర్‌కు రూ.48,000/ మంజూరు చేసిన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆపదలో అండగా నిలుస్తుంది. వైద్య ఖర్చులు భరించలేని వారికి ఈ నిధి దైవానుగ్రహంలా మారుతోంది" అని అన్నారు.అలాగే మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సేవలను రెగ్యులరైజ్ చేయాలంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వెంకట్, శాస్త్రి, గిరి, బిఆర్ఎస్ నాయకులు జనార్ధన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## బిఎస్ విద్యార్థులకు నో ఎంట్రీ.!

### పేద, గిరిజన విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం

**సత్తుపల్లి, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** గత తొమ్మిది సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు బెస్ట్ అవైలబిలిటీ స్కూల్స్ పథకం కింద సత్తుపల్లి సీటు సంపాదించి పాఠశాలల్లో చేరుతూ వస్తున్నారు. కానీ ఈ నెల నుంచి వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. స్కూల్ యాజమాన్యం వివరాల ప్రకారం, గత మూడు సంవత్సరాల నుండి ప్రభుత్వం చెల్లించవలసిన విద్యార్థుల ఫీజు అందకపోవడంతో పాఠశాల ఆర్థిక భారంతో నిదర్శన చేయలేకపోతోంది. ఫలితంగా ఈ ఏడాది 80 మంది పేద మరియు గిరిజన విద్యార్థులను తరగతి గదులకు అనుమతించలేమని తల్లిదండ్రులకు తెలిపారు. యాజమాన్యం తెలిపిన వివరాల ప్రకారం, ఫీజు బకాయిల కారణంగా ఉపాధ్యాయుల జీతాలు చెల్లించడం కష్టంగా మారింది. గత మూడు సంవత్సరాలుగా భవిష్యత్తును దృష్టిలో ఉంచి తాత్కాలికంగా విద్యార్థులను స్కూల్‌లో చేరవేసారు. కానీ ఈ సంవత్సరం ఆర్థిక భారాన్ని మోయలేకపోవడంతో తాము విద్యార్థులను తరగతి గదులకు అనుమతించలేమని తెలిపారు. తల్లిదండ్రులు ఎన్ని సార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చినా, ఎటువంటి హామీ రాకపోవడం కారణంగా ఈ పరిస్థితి ఎదురవుతున్నది. అందువల్ల మండల విద్యాశాఖ అధికారిని ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్ళి, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచి తగిన విధంగా సహకరించాలని తల్లిదండ్రులు ప్రార్థిస్తున్నారు.

# ఈకాప్ రైటర్ రాజేష్‌కు ఘన వీడ్కోలు



**కుషాయిగూడ, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ పోలీస్ స్టేషన్లో ఈకాప్ రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఏ. రాజేష్ జవహర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో రాజేష్‌కు స్టేషన్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ — రాజేష్ క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించారని, స్టేషన్ పనుల నిర్వహణలో ఆయన పాత్ర ప్రశంసనీయమని తెలిపారు. ఆయన భవిష్యత్ సేవలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.తరువాత రాజేష్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, వెంకన్న, సతీష్, సిబ్బంది సుబ్బారావు, శ్రీనివాస్, రంగన్న, ప్రణీత్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి.. రాజ్యాంగంపై దాడి

### నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ డిమాండ్




**మల్కాజిగిరి, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని భారత రాజ్యాంగంపై దాడిగా పరిగణించాలని డివైఎఫ్ఐ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బొబ్బర శ్రీనివాస్ అన్నారు. దాడికి పాల్పడిన నిందితుడిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మల్కాజిగిరి సర్కిల్ ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద డివైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ, "సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి అంటే అది ఒక వ్యక్తిపై దాడి కాదు — యావత్ రాజ్యాంగంపై దాడి. మత ప్రాతిపదికన పాలన చేయాలనుకునే మనువాద శక్తుల భావజాలాన్ని ప్రజలు గుర్తించి, సమానత్వ సమాజం కోసం పోరాడాలి" అని పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా పాల్గొన్న యువజనులు "మతోన్మాదం నశించాలి - మానవవాదం వర్ధిల్లాలి" అంటూ నినదించారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజకుమార్, మండల నాయకులు చైతన్య, సంపత్, ప్రవీణ్, యల్లేష్, మోహన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## అరేబియన్ బ్రాస్ట్ & గ్రిల్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**నాచారం, అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** నాచారం డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అరేబియన్ బ్రాస్ట్ & గ్రిల్ రెస్టారెంట్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం ప్రధాన అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిర్వాహకులు వ్యాపార రంగంలో విజయవంతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన వ్యాపారాలు యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని, స్థానిక ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అఖ్తర్, అబ్దుల్ ఖాదర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## కాజీపేట లో చైన్ స్నాచింగ్



**కాజీపేట్ అక్టోబర్ 10 (తెలంగాణ ముచ్చట్లు) :** కాజీపేట్ లోని భవాని నగర్ లో శుక్రవారం సాయంత్రం ఓ మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి చైన్ స్నాచింగ్ కు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది.బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం భవాని నగరంలో నివాసం ఉంటున్న పూల లలిత డిజిల్ కాలనీ చౌరస్తాలో టైలర్ షాపు నిర్వయించుకొంటున్నది. ఎప్పటిలాగే లలిత అనే మహిళ షాప్ కు తాళం వేసి ఇంటికి వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తుతెలియనివ్యక్తి ఒక్కసారిగా ఆమె మెడలోని సుమారు 6 తులాల పుస్తెలతాడు, చైన్ ను లాక్కెళ్లాడని ఆమె తెలిపారు. ఆ మహిళ కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొని బైక్ ను వెంబడించగా ఆ వ్యక్తి ద్విచక్ర వాహనంపై అధివేగంగా పారిపోయినట్లు తెలిపారు. బాధితురాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

# గుమ్మడి ఆకులతో అద్భుతాలు..



గుమ్మడికాయ ఆకులలో ఫ్లేవనాయిడ్లు, ఫినాలిక్ సమ్మేళనాలు, బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు, కాల్షియం, మాంగనీస్, విటమిన్ బి6, భాస్వరం కూడా ఉన్నాయి. ఈ పోషకాలన్నీ శారీరక, మానసిక అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. గుమ్మడికాయ ఆకులు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం.

మీరు ఎప్పుడైనా గుమ్మడికాయ ఆకులను వంటలో ఉపయోగించారా..? అవును, గుమ్మడికాయ కూరలాగే, దాని ఆకులు కూడా చాలా రుచికరంగా, పోషకాలతో నిండి ఉంటాయి. ఇది ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుంది. గుమ్మడికాయ ఆకులలో ఫ్లేవనాయిడ్లు, ఫినాలిక్ సమ్మేళనాలు, బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీంతో పాటు, కాల్షియం, మాంగనీస్, విటమిన్ బి6, భాస్వరం కూడా ఉన్నాయి. ఈ పోషకాలన్నీ శారీరక, మానసిక అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఈ రోజుల్లో చాలా మంది మహిళలకు ప్రీమెన్స్ట్రువల్ సిండ్రోమ్ ఒక ప్రధాన సమస్యగా మారిపోయింది. ఈ సమస్యతో బాధపడుతున్న ఆడవాళ్ల మానసిక స్థితిలో మార్పులు, తలనొప్పి, నిరాశ, చిరాకు వంటి సమస్యలతో బాధపడుతూనే ఉంటారు.. దీని నుండి ఉపశమనం పొందడానికి మహిళలు మాంగనీస్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గుమ్మడికాయ ఆకులలో మాంగనీస్ పుష్కలంగా ఉంటుంది. ఈ సమస్యలో మహిళలకు ఉపశమనం లభిస్తుంది. మహిళల్లో మలబద్ధకంతో బాధపడుతున్నవారికి గుమ్మడికాయ ఆకులు మేలు చేస్తాయి. ఫైబర్ అధికంగా ఉండే గుమ్మడికాయ ఆకులను తీసుకోవడం వల్ల మలబద్ధకం నుండి ఉపశమనం లభిస్తుంది. గుమ్మడికాయ ఆకులలో కాల్షియం, భాస్వరం పుష్కలంగా ఉంటాయి. ఇది మీ ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. దంతాల అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కీళ్ల, ఎముకల నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది.

# ఖాళీ కడుపుతో గుడ్లు తింటున్నారా..?



గుడ్డులో అధిక నాణ్యత గల ప్రోటీన్ ఉండటంతో పాటు, విటమిన్ ఎ, డి, ఇ, బి12, రిబోఫ్లేవిన్, ఫోలేట్, ఐరన్, సెలీనియం వంటి పోషకాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. గుడ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. కానీ ఈ గుడ్లను తప్పుడు మార్గంలో తీసుకుంటే, అవి ఆరోగ్యానికి ప్రయోజనం చేకూర్చే బదులు హాని కలిగించడం ప్రారంభిస్తాయి. అవును, కొంతమంది ఉదయం పనికి చేరుకోవాలనే తొందరలో అల్పాహారంగా ఖాళీ కడుపుతో గుడ్లు తింటారు. మనలో చాలా మంది గుడ్లు ఇష్టంగా తింటుంటారు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో గుడ్లు తినేవారు కూడా ఉంటారు.. గుడ్డులో ప్రొటీన్లు పుష్కలంగా ఉండటంతో ఫిట్‌నెస్ ప్రియులు దీనిని ఎక్కువ తినడానికి ఇష్టపడుతున్నారు. కొంతమంది పచ్చి గుడ్డు కూడా తింటుంటారు. మరికొందరు ఆమ్లెట్ వేసుకుని తింటారు. కానీ, ఉడికించిన గుడ్లు ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఖాళీ కడుపుతో గుడ్లు తినడం సురక్షితమేనా అన్న విషయాన్ని మీరు ఎప్పుడైనా ఆలోచించారా..? మీరు కూడా అల్పాహారం కోసం ఖాళీ కడుపుతో గుడ్లు తింటున్నట్టయితే, ఈ విషయాలు తప్పక తెలుసుకోవాలంటున్నారు పోషకాహార, వైద్య ఆరోగ్య నిపుణులు. గుడ్డులో అధిక నాణ్యత గల ప్రోటీన్ ఉండటంతో పాటు, విటమిన్ ఎ, డి, ఇ, బి12, రిబోఫ్లేవిన్, ఫోలేట్, ఐరన్, సెలీనియం వంటి పోషకాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. గుడ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. కానీ ఈ గుడ్లను తప్పుడు మార్గంలో తీసుకుంటే, అవి ఆరోగ్యానికి ప్రయోజనం చేకూర్చే బదులు హాని కలిగించడం ప్రారంభిస్తాయి. అవును, కొంతమంది ఉదయం పనికి చేరుకోవాలనే తొందరలో అల్పాహారంగా ఖాళీ కడుపుతో గుడ్లు తింటారు. కానీ, ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ఇలా చేయడం సరైనది కాదని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

# ఈ విత్తనాలు మధుమేహానికి దివ్యౌషధం



జీలకర్రలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది అజీర్ణం, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు తొలగించడంలో సహాయపడుతుంది. మలబద్ధకం సమస్య నుంచి బయటపడడానికి జీలకర్ర బాగా పని చేస్తుంది. జీలకర్రను తీసుకోవడం వల్ల పేగు కండరాలు బలంగా మారతాయి. కొలెస్ట్రాల్ తగ్గించడానికి జీలకర్ర అద్భుతంగా పనిచేస్తుంది. జీలకర్రని తీసుకోవడం వ్ప ఒంట్లో ఉన్న కొలెస్ట్రాల్ కరిగి అధిక బరువు సమస్య నుంచి కూడా బయటపడడానికి అవుతుంది. బరువు తగ్గాలనుకుంటే జీలకర్రని తీసుకోవడం మంచిది. జీలకర్రను తీసుకోవడం వల్ల అధిక బరువు సమస్య నుంచి సులువుగా బయటపడొచ్చు. షుగర్ ఉన్నవారు జీలకర్రని తీసుకుంటే మంచిది. టైప్2 డయాబెటిస్ కంట్రోల్ అవుతుంది. ఇన్సులిన్ స్థాయిలు నియంత్రిస్తాయి. రక్తంలో చక్కెర లెవెల్స్ అదుపులో ఉంచుకోవచ్చు. రోగనిరోధక శక్తిని పెంచడంలో జీలకర్ర నీరు కూడా చాలా ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలనుకుంటే జీలకర్రని తీసుకోవడం మంచిది. ఒత్తిడిని తగ్గించుకోవడానికి జీలకర్ర బాగా పనిచేస్తుంది. జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. జీలకర్రను తీసుకుంటే ఆందోళన, డిప్రెషన్ వంటి సమస్యలు కూడా ఉండవు. జ్ఞాపకశక్తిని పెంచుకోవడానికి జీలకర్ర బాగా పనిచేస్తుంది. జీలకర్రని తీసుకుంటే మెదడు చురుకుగా పని చేయడమే కాకుండా మెదడు ఆరోగ్యం మెరుగుపడుతుంది. క్యాన్సర్ సమస్యని అడ్డుకోవడానికి జీలకర్ర బాగా పనిచేస్తుంది. లివర్ క్యాన్సర్, పెద్ద ప్రేగు క్యాన్సర్ వంటి వాటి నుంచి దూరంగా ఉంచుతుంది. మంచి నిద్రని పొందాలంటే జీలకర్రను తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే మెలటోనిన్ హాయిగా నిద్ర పట్టేటట్టు చూస్తుంది. దీంతో నిద్రలేమి సమస్య నుంచి సులువుగా బయటపడవచ్చు. జీలకర్రలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ప్రతిరోజూ ఖాళీ కడుపుతో జీలకర్ర నీరు తాగడం వల్ల అనేక వ్యాధుల నుండి మిమ్మల్ని రక్షించుకోవచ్చు. జీలకర్ర గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి ఇది మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. జీలకర్ర నీరు కడుపుకు చాలా మంచిది. నిజానికి, జీలకర్ర నీటిని ఆమ్లత్వం, ఉబ్బరం, అజీర్ణం, కడుపు నొప్పికి దివ్యౌషధంగా పరిగణిస్తారు. జీలకర్ర నీరు జీర్ణప్రక్రియను వేగవంతం చేస్తుంది. తద్వారా పేగు సమస్యలను కూడా తొలగిస్తుంది. గర్భధారణ సమయంలో జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అయితే, గర్భిణీ స్త్రీలు వైద్యుడిని సంప్రదించిన తర్వాత దీనిని తీసుకోవడం మంచిది.

# కివి పండ్లను వీరు అస్సలు తినకూడదు



కివిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్లతో పాటు విటమిన్ బి6, విటమిన్ సి, ఫైబర్, కాల్షియం, పొటాషియం, కార్బోహైడ్రేట్లు, భాస్వరం, మెగ్నీషియం, రాగి, జింక్, నియాసిన్, రిబోఫ్లేవిన్, బీటా కెరోటిన్ వంటి పోషకాలు పుష్కలంగా నిండి ఉన్నాయి. ఇది మనల్ని అనేక వ్యాధుల నుండి దూరంగా ఉంచుతుంది. రుచికి పుల్లగా ఉండే కివి పండు ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. అయినప్పటికీ, దానిని అవసరమైన దానికంటే ఎక్కువగా తీసుకుంటే అది ప్రయోజనానికి బదులుగా ఆరోగ్యానికి హాని కలిగిస్తుంది. ముఖ్యంగా కొన్ని అనారోగ్య సమస్యలతో బాధపడేవారు ఈ కివి పండ్లకు దూరంగా ఉంటేనే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కిడ్నీ సమస్యలు ఉన్నవారు కివి పండ్లకు దూరంగా ఉండాలి. వాస్తవానికి కివిలో పొటాషియం ఉంటుంది. ఇది మూత్రపిండాల వ్యాధులతో బాధపడే వారిపై మరింత ఎఫెక్ట్ చూపుతుంది. అందుకే.. కిడ్నీ రోగులు ఆహారంలో పొటాషియం తక్కువ మొత్తంలో తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. కివి పండ్లను అతిగా తినటం వల్ల కూడా కొన్ని రకాల సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. దీంతో చర్మంపై దద్దుర్లు, వాపు, దురద, ఉబ్బసం మొదలైన అనేక రకాల అలెర్జీ సమస్యలు వస్తాయి. కొందరిలో నోటి అలెర్జీ సిండ్రోమ్ వచ్చే ప్రమాదం ఉంది. దీంతో నోరు, పెదవులు, నాలుక ఉబ్బుతాయి. మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు కివి పండ్లకు దూరంగా ఉండాలి. కివిలో పొటాషియం ఉంటుంది, ఇది మూత్రపిండాల వ్యాధికి హాని కలిగిస్తుంది. కిడ్నీ రోగులు తమ ఆహారంలో తక్కువ మొత్తంలో పొటాషియం తీసుకోవాలని సూచించారు. కివి ఎక్కువగా తినడం వల్ల కూడా తీవ్రమైన ప్యాంక్రియాటైటిస్ వస్తుంది. ఈ సమస్యలో క్లోమం వాపు రావచ్చు. అలాంటి వారు తీవ్రమైన కడుపు నొప్పితో ఇబ్బంది పడాల్సి వస్తుంది. కివిలో ఉండే అధిక ఫైబర్ విరేచనాలు, కడుపు నొప్పి, వికారం, వాంతులు వంటి సమస్యలను కలిగిస్తుంది. గర్భిణీ స్త్రీలు ఒక రోజులో రెండు లేదా మూడు కివిలకు మించి తినకూడదు. కివి ఎక్కువగా తీసుకోవడం వల్ల అసిడిటీ, చర్మంపై దద్దుర్లు, గొంతు నొప్పి వచ్చే అవకాశం ఉంది. అలాగే, గ్యాస్ట్రిటిస్, జీర్ణక్రియకు సంబంధించిన ఏదైనా సమస్య ఉంటే కివి తినకూడదు. కివిలో ఉండే యాసిడ్ ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది.

# మామిడి బొప్పాయి తింటే కండరాలు పెరుగుతాయా?




మామిడి పండ్లు, బొప్పాయి వంటి పండ్లు కండరాల అభివృద్ధికి ప్రోటీన్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయా అనే సందేహం చాలా మందికి ఉంది.డిజిటల్ క్రియేటర్ టెడ్ కార్ మామిడి, బొప్పాయి కండరాల అభివృద్ధికి ఉపయోగపడతాయని చెప్పడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. దీని గురించి తెలుసుకోవడానికి నిపుణులను సంప్రదించగా కండరాల అభివృద్ధికి ప్రోటీన్ చాలా ముఖ్యమని తెలిపారు. మామిడి, బొప్పాయి ప్రోటీన్‌కు ప్రత్యామ్నాయం కాదని తెలిపారు. బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్‌ను జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. దీని ద్వారా మీరు తీసుకునే ప్రోటీన్ మీ శరీరంలో సమర్థవంతంగా పనిచేస్తుంది. బొప్పాయిలో విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. ఇంకా ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కూడా ఉన్నాయి. ఇవి వ్యాయామం వల్ల కలిగే కండరాల నొప్పుల నుండి కోలుకోవడానికి సహాయపడతాయి. మామిడిలో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి ప్రోటీన్ కానప్పటికీ వ్యాయామాలకు అవసరమైన శక్తిని అందిస్తాయి. ఇది కారుకు నింపే ఇంధనం లాగా పనిచేస్తుంది. మామిడిలో విటమిన్ ఎ, సి, యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. వారంలో మూడు లేదా నాలుగు సార్లు 150 నుండి 160 గ్రాముల వరకు మామిడిపండు తినవచ్చు. అదేవిధంగా 140 నుండి 150 గ్రాముల వరకు బొప్పాయి పండ్లను తినవచ్చు. మామిడి, బొప్పాయి ఆరోగ్యానికి మంచివే.. కానీ అవి ప్రోటీన్‌కు ప్రత్యామ్నాయం కావు. సరైన ప్రోటీన్ కలిగిన ఆహారాలతో కలిపి వీటిని తీసుకోవాలి. ముఖ్యంగా వీటిని ఎక్కువగా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయి కూడా పెరుగుతుంది. కాబట్టి లిమిటెడ్ గా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది.

# విటమిన్ మాత్రలను ఎప్పుడు తీసుకోవాలి..?



చాలా మంది రోగులు, పోషకాల లోపం ఉన్నవారు డాక్టర్ చెప్పిన మోతాదులో విటమిన్లను తీసుకుంటున్నా తమకు ఎలాంటి మెరుగుదల కనిపించడం లేదని చెబుతుంటారు. దీనికి కారణం ఏమిటంటే.. ఏ విటమిన్‌ను ఏ సమయంలో తీసుకోవాలి..? నీటిలో కరిగే విటమిన్లు అంటే విటమిన్ దీ12, విటమిన్ జ వంటివి శరీరంలో నిల్వ ఉండవు. అవి త్వరగా విసర్జించబడతాయి. వీటిని శోషించడానికి చాలా నీరు అవసరం. వీటిని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోవడం ఉత్తమం. ఖాళీ కడుపుతో తీసుకోలేకపోతే.. బ్రేక్ ఫాస్ట్ తర్వాత ఒక గంటకు తీసుకోవచ్చు. అప్పటికి ఆహారం జీర్ణమై నీటితో పాటు విటమిన్లు కూడా సరిగా శోషించబడతాయి. ఉదాహరణకు విటమిన్ దీ12 కు సిఫార్సు చేయబడిన రోజువారీ మోతాదు 2.4 మైక్రోగ్రాములు. వైద్య పరిస్థితి లేదా ఆహార లోపాల కారణంగా ఈ మొత్తం మీకు అందకపోతే మీరు సప్లిమెంట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఒక మాత్రలో 1500 మైక్రోగ్రాములు ఉండవచ్చు. ఇది అధిక శక్తి కలిగినది.. కానీ నీటిలో కరిగినందున శరీరంలో 4 శాతం వరకు మాత్రమే శోషించబడుతుంది. అందుకే మందులు తీసుకునే సమయం ముఖ్యం. ఎప్పుడూ నిండిన కడుపుతో తీసుకోకూడదు. ఇది శోషణ ప్రక్రియకు ఆటంకం కలిగిస్తుంది. కొవ్వులో కరిగే విటమిన్లు. అంటే విటమిన్లు A, ఇ, జు, ఖ వంటివి జీవ లభ్యత, శోషణను పెంచడానికి కొవ్వు కలిగిన ఆహారం తిన్న వెంటనే తీసుకోవాలి. నీటిలో, కొవ్వులో కరిగే విటమిన్లు కలిపి తీసుకోవచ్చా..? లేదు.. తీసుకోకూడదు. అందుకే మల్టీవిటమిన్ క్యాప్సూల్స్ తీసుకోవడం వల్ల సమస్యలు వస్తాయి. వీటిని భోజనం తర్వాత కొద్దిసేపటికి నీటితో తీసుకుంటే చాలా మంచి ఫలితాలు ఉంటాయి. మీరు మీ ఆహారంలో కాలేయం, గుడ్లు, చేపలు, పాల

# కడుపులో గ్యాస్ సమస్య ఎందుకు ఏర్పడుతుంది..?



ప్రజల చెడు ఆహారపు అలవాట్లు వారిని అనారోగ్యానికి గురి చేస్తాయి. ముఖ్యంగా తినడానికి, తాగడానికి ఇష్టపడేవారు వారి జీర్ణక్రియపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. బయటి ఆహారం ఎక్కువగా తినడం వల్ల కడుపు నొప్పి, గ్యాస్, అసిడిటీ వస్తుంది. రుతువులు మారుతున్న కొద్దీ, జీర్ణక్రియ బలహీనంగా ఉన్నవారి సమస్యలు కూడా పెరుగుతాయి. ప్రజలు రోజూ అనుసరించే తప్పుడు ఆహారపు అలవాట్లే జీర్ణక్రియ బలహీనపడటానికి కారణమని రాజీవ్ దీక్షిత్ వివరించారు. భారతదేశంలో ప్రముఖ సామాజిక కార్యకర్త, ఆయుర్వేద సలహాదారు రాజీవ్ దీక్షిత్ ఆరోగ్య సమస్యలపై సలహాలు, సూచనలు అందించేవారు. ఈ కడుపు సమస్యలను ఎప్పుడూ ఎదుర్కొనే వ్యక్తులు తమ ఆహారం కడుపులో సరిగ్గా జీర్ణం కావడం లేదని అర్థం చేసుకోవాలి. ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే అది కుళ్ళిపోతుంది. ఇది బ్యాక్టీరియా ఏర్పడటానికి దారితీస్తుంది. అలాగే గ్యాస్ సమస్యలను కలిగిస్తుంది. దీని నుండి బయటపడాలంటే కొన్ని అలవాట్లు పాటించాలి. నీరు తాగడానికి సమయం: ఆహారం తిన్న వెంటనే ఎప్పుడూ నీరు తాగకండి. ఆహారం తిన్న 1 గంట తర్వాత మాత్రమే నీరు తాగాలి. ఇంత సమయం ఉండటం అవసరం. 2. ఆహారాన్ని ఎలా నమలాలి: మనం మన ఆహారాన్ని సరిగ్గా నమలాలి. మనం ఆ ఆహారాన్ని కొద్దిగా నమిలి మింగితే, అది త్వరగా జీర్ణం కాదు. అలాగే అజీర్ణ సమస్యకు కారణమవుతుంది. మీరు ప్రతి ముద్దను సరిగ్గా నమిలి తినాలి. ఆహారంతో పెరుగు లేదా మజ్జిగ: అయితే శీతాకాలంలో ఈ అలవాటు జలుబు లేదా దగ్గుకు కూడా కారణమవుతుంది. మీరు రోజు భోజనంతో పాటు 1 గ్లాసు పలుచని మజ్జిగ తాగాలి. ఇది ప్రోబయోటిక్ పానీయం. ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గ్రీస్‌లో ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తు సమర్పించాలి....

- **జిల్లా ఉపాధి అధికారి శ్రీరామ్**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -10, తెలంగాణ ముచ్చట్లు;**

గ్రీస్ లో హాస్పిటాలిటీ, నిర్వహణ, సేవా రంగాలలో 1000 విదేశీ ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తు సమర్పించాలని జిల్లా ఉపాధి అధికారి కే. శ్రీరామ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా గ్రీస్ లో హోటల్ మేనేజ్మెంట్ డిప్లొమా/డిగ్రీ కలిగిన వారికి, ప్రభుత్వ అనుమతితో నైపుణ్య ధృవీకరణ పొందిన అభ్యర్థులకు హాస్పిటాలిటీ, నిర్వహణ, సేవా రంగాలలో ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు వేతనం 92 వేల నుంచి లక్షా 22 వేల రూపాయల వరకు అందుతుందని, గ్రీకు భాషలో పరిజ్ఞానం అవసరం లేదని, ఆంగ్ల భాష పరిజ్ఞానం తప్పనిసరి అని, ఉద్యోగదారునికి ఉచిత వసతి, భోజనం, భీమా కల్పించనున్నట్లు అదనపు పని గంటలకు ప్రతి గంటకు 20 శాతం అదనపు వేతనం అందించబడుతుందని ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తు, రెజ్యూమ్ లను tomcom.resume@gmail.com కు మేయిల్ చేయాలని మరిన్ని వివరాలకు 9440052081, 9440051452 ఫోన్ నెంబర్ల నందు సంప్రదించాలని ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అక్టోబర్ 15 లోపు టీచింగ్ పోస్టులకు దరఖాస్తు సమర్పించాలి...

- **జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ముజాహిద్**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ -10, తెలంగాణ ముచ్చట్లు;** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టులకు ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేయుటకు ఆసక్తి గల వారు అక్టోబర్ 15 లోపు దరఖాస్తు సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.డి. ముజాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.
సత్తుపల్లి బాయ్స్ నందు జనరల్ టిజిటి ఇంగ్లీష్, నేలకొండపల్లి బాయ్స్ నందు జనరల్ జెఎల్ మ్యాథ్స్, స్త్రీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేలా ఖమ్మం బాలికల జూనియర్ కళాశాల నందు మ్యాథ్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ పోస్ట్ లు, వైరా గర్ల్స్ నందు పిజిటి ఇంగ్లీష్, ఖమ్మం గర్ల్స్ నందు ఫిజికల్ డైరెక్టర్ పోస్ట్ ఖాళీగా ఉందని అన్నారు. జె.ఎల్, పిజిటి పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీ 50 శాతం మార్కులతో పాటు బీ.ఇడీలో 50 శాతం మార్కులు, టి.జి.టి. పోస్టులకు సంబంధిత సబ్జెక్టు గ్రాడ్యుయేషన్, బీ.ఇడి లో 50 శాతం మార్కులతో టెట్ తప్పనిసరి అని, బోధన అనుభవం 3 సంవత్సరాలు ఉండాలని, అభ్యర్థులు ఖమ్మం జిల్లాకు చెందిన వారై ఉండాలని అన్నారు.
అభ్యర్థుల తమ పూర్తి బయోడేటా విద్యార్హతల సర్టిఫికెట్ ఫోటో కాపీలు, ఇతర పత్రాలతో సంబంధిత మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల నందు అక్టోబర్ 13 నుంచి అక్టోబర్ 15 సాయంత్రం 4.00 గంటల లోపు దరఖాస్తులు సమర్పించాలని, షాట్ లిస్ట్ అయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని తెలిపారు. నియామకాలు పూర్తిగా ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన తాత్కాలికంగా ఉంటాయని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మోదీతో మాట్లాడటానికి నెతన్యాహు భద్రతా సమావేశం నిలిపివేత

- **గాజా యుద్ధ సమయంలో భారత్ తటస్థ దౌత్య సంకేతాలు**
- **మానవతా సహాయం, బంధీల విషయంలో చర్చలు జరిగిన సూచనలు**
- **భారత దౌత్య బలం పై అంతర్జాతీయ రాజకీయ వర్గాల దృష్టి**

మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న యుద్ధ ఉధృతిని దృష్టిలో ఉంచుకుని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అత్యవసరంగా నిర్వహిస్తున్న భద్రతా సమీక్ష సమావేశాన్ని మధ్యలోనే నిలిపివేసి భారత ప్రధాని నరేంద్ర మోదీతో నేరుగా ఫోన్‌లో మాట్లాడటం అంతర్జాతీయ వేదికపై గమనించదగిన పరిణామంగా మారింది. గాజా ప్రాంతంలో హమాస్ దాడులు, ప్రతిగా ఇజ్రాయెల్ సైన్యం చేపడుతున్న వైమానిక హెచ్చరిక చర్యలు వరుసగా కొనసాగుతున్న సమయంలో జరిగిన ఈ సంభాషణకు ప్రాధాన్యం పెరిగింది. ప్రపంచం మొత్తం ఉద్రిక్తతను ఆపడానికి దౌత్యరంగ ప్రయత్నాలు ప్రారంభించినప్పటికీ యుద్ధ వాతావరణం మార్పు చెందకపోవడంతో భారత్ స్పందనను తెలుసుకోవాలనే ఉద్దేశంతో నెతన్యాహు మోదీని సంప్రదించినట్లు సమాచారం. ఇంతకుముందే మోదీ హింస ఏ రూపంలోనైనా ఆగాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. సాధారణ ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడకూడదని, మానవతా దృష్టిలో పరిష్కారం కావాలని భారత్ ప్రకటించిన తటస్థ వైఖరి ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకుల దృష్టిని ఆకర్షిస్తోంది. భారత దేశం యుద్ధాన్ని మౌనంగా గమనించడమే కాక, అవసరమైతే శాంతి చర్చలకు మధ్యవర్తిత్వం చేసే సామర్థ్యం ఉన్న దేశంగా భావించబడుతున్న నేపథ్యంలో నెతన్యాహు మోదీతో నేరుగా సంప్రదించడం భారత దౌత్య బలం ఎటువంటి స్థాయికి చేరుకుందనే ప్రశ్నను ప్రపంచానికి ముందుంచింది. ఫోన్ సంభాషణలో మానవతా సహాయం, బంధీల విడుదల, గాజాలో చిక్కుకుపోయిన పౌరుల రక్షణ వంటి కీలక అంశాలు చర్చకు వచ్చాయని ఇజ్రాయెల్ మీడియా వెల్లడిరచింది. యుద్ధం కఠిన మలుపు తీసుకుంటుండగా భారత్ స్పందనను సానుకూలంగా చూడాలని ఇజ్రాయెల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. భారత్ పరిస్థితిని సమతుల్యతతో చూడాలనే తన విధానాన్ని కొనసాగిస్తూనే, దౌత్యరంగ సంకేతాల ద్వారా శాంతి యత్నాలకు దారితీసే సందేశాలను ఇస్తోంది. ఇలాంటి సమయంలో నెతన్యాహు అత్యవసర భద్రతా సమావేశాన్ని బ్రేక్ చేసి మోదీతో మాట్లాడటం కేవలం సౌజన్యం కాదని, యుద్ధ వాతావరణంలో భారత్ మాటకున్న అంతర్జాతీయ ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



# భూపతి రెడ్డి కుటుంబానికి సీఎం పరామర్శ

- **తల్లి లక్ష్మీ నరసమ్మ ద్వాదశ దినకర్మలో శోకసంద్రం**
- **ప్రజాప్రతినిధుల హాజరుతో కార్యక్రమానికి గౌరవం**
- **కుటుంబానికి ప్రోత్సాహం.. పార్టీ మద్దతు కొనసాగుతుందన్న హామీ**

**నిజామాబాద్, తెలంగాణ ముచ్చట్లు;**

నిజామాబాద్ జిల్లా వీరన్నపల్లి ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నిజామాబాద్ (గ్రామీణ) ఎమ్మెల్యే భూపతి రెడ్డి తల్లి లక్ష్మీ నరసమ్మ గారు ఇటీవల కన్నుమూయగా, కుటుంబ సభ్యులు ఇంకా ఆవేదనలోనే ఉన్నారు. ఈ క్రమంలో కుటుంబానికి ఆత్మస్థైర్యం చేకూర్చడానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా హాజరై పరామర్శించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ద్వాదశ దినకర్మ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి లక్ష్మీ నరసమ్మ చిత్రపటానికి నివాళులర్పించి మౌనం పాటించారు. భూపతి రెడ్డి గారితో మాట్లాడుతూ ఈ దుఃఖ సమయంలో ప్రభుత్వం, పార్టీ, ప్రజాప్రతినిధులు తమతో ఉన్నారని భరోసా ఇచ్చారు. తల్లిని కోల్పోవడం ఎవరికి అయినా జీవితంలో అత్యంత లోటని, అలాంటి సమయంలో బలంగా నిలబడాలని సూచించారు.

**ప్రజాప్రతినిధుల హాజరుతో కార్యక్రమానికి గౌరవం**

ఈ కార్యక్రమానికి మంత్రి ధనసరి అనసూయ సీతక్క, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీనియర్ నేత మహమ్మద్ అలీ షబ్బీర్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరయ్యారు. స్థానికంగా భారీ సంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అనుచరులు హాజరై భూపతి రెడ్డి కుటుంబానికి సంతాపం తెలిపారు.

**కుటుంబానికి ప్రోత్సాహం.. పార్టీ మద్దతు కొనసాగుతుందన్న హామీ**

నేతలు మాట్లాడుతూ లక్ష్మీ నరసమ్మ సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ తనయుడిని ప్రజాసేవలో ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. కుటుంబానికి ఎల్లప్పుడూ పార్టీ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆత్మీయత, ఆవేదన, రాజకీయ ఐక్యత ఏకకాలంలో కనిపించాయి.





# హైకోర్టు స్టేకు వ్యతిరేకంగా నర్సంపేటలో బీసీల రాస్తారోకో

**నర్సంపేట,అక్టోబర్10(తెలంగాణ ముచ్చట్లు):**

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు విధించిన స్టేను నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నర్సంపేటలో రాస్తారోకో జరిగింది. జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు జిల్లా అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ నేతృత్వంలో ఈ ధర్నా జరిగింది.
ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే అగ్రవర్ణాల కుట్రలో భాగమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధంగా కులగణన పూర్తి చేసి 42 శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రానికి పంపినా, కేంద్రం పార్లమెంట్‌లో చర్చించకపోవడం నిరాశాజనకమన్నారు. రెడ్డి జాగృతి పేరుతో అగ్రకుల నాయకులు పిటిషన్ వేసి బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడం దురదృష్టకరమని అన్నారు.
తెలంగాణలో అగ్రకుల జనాభా ఆరు శాతం కూడా లేకపోయినా, 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతుండగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అడ్డుకోవడం అన్యాయమని విమర్శించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని బీసీ నాయకులు ఐక్యంగా పోరాడాలని, పార్టీ జెండాలను పక్కన పెట్టి రిజర్వేషన్లు సాధించే దిశగా ఉద్యమం కొనసాగించాలని పిలుపునిచ్చారు. రాస్తారోకోలో పాల్గొన్న బీసీ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి అనంతరం విడుదల చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ అధ్యక్షుడు కడారి సురేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు ముద్రబోయిన రమేష్ ముదిరాజ్, జిల్లా అధికార ప్రతినిధి మరుపల వీరస్వామి కురుమ, జిల్లా సహాయ కార్యదర్శి మట్ట రమేష్ యాదవ్, డ్యాగం శివాజీ, మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, గాండ్ల శ్రీనివాస్, భేతి భాస్కర్, గోపగాని నాగరాజ్ గౌడ్, పొన్నాల మహిపాల్, చొప్పరి భాస్కర్ ముదిరాజ్, బండారి ఉదయ్ కిరణ్, బర్ల యాకయ్య, బండి విజయ, చామంతుల రమేష్ ముదిరాజ్, ముంజ లక్ష్మి, కారుపోతుల శ్రీదేవి, వైనాల రజిత, గొర్రె వినయ్ ముదిరాజ్, శ్రీకాంత్, ల్యాగల ప్రవీణ్ కుమార్, సింగనబోయిన నవీన్ తదితరులు పాల్గొన్నారు.





# తగ్గేదేలే... హైదరాబాద్ రియల్ ఎస్టేట్ దూసుకెళ్తోంది


- **పితృపక్షాలైనా అమ్మకాల జోరు తగ్గని హైదరాబాద్ రియల్టీ మార్కెట్**
- **సెప్టెంబర్‌లో రూ.4,804 కోట్ల గృహ లావాదేవీలు**
- **70 శాతం వృద్ధి నమోదు**
- **కోటి రూపాయల పైబడిన ఇళ్ల కొనుగోళ్లలో 151 శాతం పెరుగుదల**
- **రిజిస్ట్రేషన్లలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ఆధిపత్యం**

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

హైదరాబాద్ నగరంలో ఆస్తి మార్కెట్ మరింత వేగం పుంజుకుంది. సాధారణంగా కొనుగోళ్లు మందగించే పితృపక్షాల కాలంలో కూడా నగరవాసుల నుంచి భారీగా స్పందన రావడం రియల్ ఎస్టేట్ రంగాన్ని ఉత్సాహపరుస్తోంది. సెప్టెంబర్ నెలలో జరిగిన గృహ రిజిస్ట్రేషన్ల మొత్తం విలువ రూ.4,804 కోట్లకు చేరుకోవడం ఈ జోరు ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి చాలుతుంది. నైట్ ఫ్రాంక్ ఇండియా తాజా నివేదిక ప్రకారం, ఇది గతేడాదితో పోలిస్తే 70 శాతం అధికం.
సాధారణ మధ్యతరగతి కొనుగోళ్ల కంటే విలాసవంతమైన గృహాల కొనుగోళ్లపైనే నగరవాసుల దృష్టి కేంద్రీకృతం అవుతోంది. కోటి రూపాయల కంటే ఎక్కువ విలువ కలిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు 151 శాతం పెరగడం ఇదే ధోరణిని స్పష్టం చేస్తోంది. మొత్తం లావాదేవీలలో ఈ ప్రీమియం సెగ్మెంట్ వాటా 53 శాతానికి చేరడం మార్కెట్ గమనాన్ని పూర్తిగా మార్చేస్తోంది. రిజిస్ట్రేషన్ల సంఖ్యలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైంది. మొత్తం నివాస గృహాల రిజిస్ట్రేషన్లు 35 శాతం పెరిగినట్లు నివేదిక చెబుతోంది.
నైట్ ఫ్రాంక్ ఇండియా ఛైర్మన్ శిశిర్ బైజల్ ఈ వివరాలపై స్పందిస్తూ, "హైదరాబాద్ మార్కెట్ తన బలం నిరూపించుకుంటోంది. సీజనల్ ప్రెషర్లకు లొంగకుండా మార్కెట్ వేగం నిలకడగా కొనసాగుతోంది. పెద్ద ఇళ్లు, వ్యక్తిగత స్థలాలకు డిమాండ్ పెరగడం జీవనశైలి మార్పులకు నిదర్శనం'' అని పేర్కొన్నారు.
రిజిస్ట్రేషన్ అయిన ఇళ్ల విస్తీర్ణం కూడా గమనార్హ అంశం. 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల మధ్య గృహాలే ఎక్కువగా కొనుగోలు అవుతున్నాయి. ఇంతకుముందు పెద్ద ఇళ్లపై ఆసక్తి తక్కువగా ఉన్నా, ఇప్పుడు 2,000 చదరపు అడుగులకు పైబడిన ఇళ్ల కొనుగోళ్లు కూడా పెరుగుతున్నాయి. గతేడాది 13 శాతం మాత్రమే ఉన్న ఈ విభాగం ఈసారి 15 శాతానికి చేరింది. అంటే స్థల అవకాశాలు, ప్రీమియం లైఫ్‌స్టైల్‌పై ధనవంతుల వర్గం అధికంగా దృష్టి పెడుతున్నట్లు అర్థమవుతోంది.
భౌగోళికంగా చూస్తే రిజిస్ట్రేషన్లలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ముందంజలో ఉన్నాయి. రంగారెడ్డిలో 45 శాతం, మేడ్చల్‌మల్కాజిగిరిలో 40 శాతం, హైదరాబాద్ నగర పరిధిలో 14 శాతం రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. ఐటి ఉద్యోగుల స్థిరపడే ఆసక్తి, మెట్రో కనెక్టివిటీ, రింగ్ రోడ్ ప్రభావం, కొత్త వాణిజ్య కేంద్రాల అభివృద్ధి కలిసి ఈ ప్రాంతాల్లో ఆస్తుల కొనుగోళ్లకు ఊపునిచ్చాయి. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఇప్పుడు కేవలం గృహావసరం కోసం మాత్రమే కాక, భద్రమైన పెట్టుబడి అవకాశంగా మారుతోంది. పెట్టుబడి దారులు, ఎన్‌ఆర్‌ఐలు, హైఎండ్ ప్రొఫెషనల్స్ ఒకే దిశగా చూస్తున్నారు. నగర అభివృద్ధి వేగం, ప్రభుత్వ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు, కొత్త అవకాశాలుఇవి అన్నీ కలిసి హైదరాబాద్‌ను దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ కేంద్రంగా నిలబెడుతున్నాయి.







Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in